ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
28 ఆగస్టు, 2011

ENTERED



వినాయక విలాసం
పర్యావ'రణ'ం

హ్యాపీ బర్త్‌డే

(2011 ఆగస్టు 28 నుంచి
2011 సెప్టెంబర్ 3 వరకు)

కె. వర్షిణి(వెన్ని)
2సం॥, సెప్టెంబర్-1
చైతన్య-సాంబరాజు
కృష్ణాజిగూడెం-వరంగల్

అమ్ములు
1సం॥, ఆగస్టు-2010
లత-చిరంజీవి
సిరిసిల్ల

వి.ఎ.నళిని
1సం॥, సెప్టెంబర్-2010
సాహితి-శివప్రసాద్
ఏలూరు

ఎ.ప్రకాష్
ఆగస్టు
ఎలిజబెత్-నాగేశ్వరరావు
మెదక్

డి.ఎస్.వి.సాయి
1సం॥, ఆగస్టు-28
శ్రీలక్ష్మి-కిషోర్
మంగళగిరి-గుంటూరు

వై.మైథిలి
6సం॥, ఆగస్టు-28
మరియమ్మ-జోసఫ్
నాగిరెడ్డికాలనీ-కడప

పి.అనుష్క
2సం॥, ఆగస్టు-31
శాంతి-మాధవరావు
జుజ్జూరు-కృష్ణా



పి.మనోజ్ఞ
6సం॥, ఆగస్టు-31
జయ-ఆశన్న
క్రాంతినగర్-ఆదిలాబాద్

ఆర్.లక్షయ్
5సం॥, ఆగస్టు-2006
సరిత-శ్రీధర్
నాగోల్-హైదరాబాద్

పి. దీక్షిత్
1సం॥, ఆగస్టు-30
మంజుభార్గవి-నర్సింహులు
అల్లిపూర్-రంగారెడ్డి

కె.లతామాధురి
ఆగస్టు-31
ఉమశ్రీ-సత్యనారాయణ
కాప్రా-హైదరాబాద్

సాయి ప్రజ్ఞ
3సం॥, సెప్టెంబర్-3
కళ్యాణి-వెంకట్‌రెడ్డి
దుద్దెనపల్లి-కరీంనగర్

కె. రేణుశ్రీ(సిరి)
1సం॥, సెప్టెంబర్-2010
సంతోష్-సాయి
తుర్కపల్లి-నల్లగొండ

డి.ప్రవల్లిక-చిన్నారి
ఆగస్టు
నాగమణి-నరసింహారావు
రాయగూడెం-ఖమ్మం

డి. శ్రీహర్షద్
3సం॥, ఆగస్టు-2008
రోజా-వెంకటేశ్వరరావు
నడపల్లి-కత్రినాకోన

మనలో మాట

రోగాల కాలం



ఇది వానాకాలం. జబ్బుల కాలం. తెలుగునాట ఏ ఇంట చూసినా వాల్చిన మంచం కనీసం ఒకటైనా కనిపిస్తోంది. ముక్కుతూ దగ్గుతూ ముసుగు తన్నిన మనిషి ఒకరైనా వుంటున్నారు. ఒకరికి అంటుకొంటే చాలు అందరికీ తగులుకొంటున్నాయి. సహాయకులను వెంట తీసుకొని ఆస్పత్రికెళితే చేంతాడంత క్యూలు దర్శనమిస్తున్నాయి. అక్కడ పరిచయస్తులు పదిమందైనా కనిపించకపోతే ఒట్టు. పల్లెలూ పట్నాలే కాదు. అడవులకూ రోగాలు ధోకా లేకుండా విస్తరిస్తున్నాయి. నిజానికి అడవిబిడ్డలకు ఈ రోజుల్లో జ్వరాలెప్పుడూ ఇంటి పేరులా వెంటే వుంటాయి. వచ్చిన రోగం పోగొట్టడానికి వైద్యులూ వుండరు. చూపించుకోవడానికి పైసలూ వుండవు.

ఈ రోగాలూ, రొష్టులూ మనుషులకే కాదు. చెరువులకూ, కాల్వలకూ పట్టుకున్నాయి. చవితికి నాలుగురోజుల ముందునుంచే చెరువులకు తుమ్ములూ దగ్గులొస్తున్నాయి. ముక్కులు ఎగబీలుస్తున్నాయి. మరి చవితి వచ్చిందీ అంటే నిమజ్జనం వుండకుండా వుంటుందా! గణేష్ మహారాజు భారీ విగ్రహాలను నీటి ప్రవాహాల్లో వదలకుండా వుంటారా! ఆ వినాయకులవారితోపాటు కాలుష్యం రాకుండా వుంటుందా! అందుకేనేమో ముందస్తుగానే అవి దిగాలుపడుతున్నట్లున్నాయి.

పిల్లలు పాఠాలు నేర్చుకునే బడులకూ జబ్బు చేసింది. అదని, ఇదని చేస్తున్న సమ్మెలు, బందుల పుణ్యమా అని అవి ఎప్పుడు తెరిచి వుంటాయో... ఎప్పుడు మూసి వుంటాయో తెలియదు. లేచి త్వరగా తయారవ్వరా అని అమ్మ కేకేస్తే ఈరోజు బంద్ లేదా అమ్మా అంటూ ఎల్‌కేజీ బుడతడు అడిగే రోజులొచ్చాయి. ప్రత్యేక ప్రాంతాల సంగతి 'పై'వాడికెరుక (సారీ...సారీ...పైనున్న అమ్మకెరుక)! బందుల ప్రయోజనం ఎలా వున్నా పాఠాలు పూర్తికావట్లేదు బాబో అని పంతుళ్లు, తల్లిదండ్రులు ఒకటే గోల.

అసలు మన ప్రభుత్వానికే పెద్ద రోగం పట్టుకొంది. వెంటిలేటర్ పెట్టేశారు. ఏ నిమిషానికి ఏం జరుగునో ఎవరికి తెలుసు?! ఛత్...సర్కార్‌ది మరీ అనాథ బతుకైంది. జాగ్రత్త. 'వెంటిలేటర్ పీకేస్తాను' అని హెచ్చరించే వారే అందరూ. ఏం చేద్దాం రోగాల కాలం మరి.

★

ఈ సంచికలో....

టపా	...	2
ఎవరిగోల వారిది	...	3
ఈ పేజ్	...	4
కథ	...	6
అట్టమీది కథ	...	14
రుచి	...	18
కొత్తపుస్తకాలు	...	19
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

పాపల పీక నులిమే పవిత్రభూమి ... 8

సినిమా కబుర్లు ... 10

తెలుగు తెరపై కౌబాయ్‌లకు కౌబాయ్

చూద్దామా ... 12

ఎల్లోరా గుహలు

వికాసం ... 20

కొంచెం కెమిస్ట్రీ తెలుసుకుందాం



కృషితో నాస్తి....

మా నెల్లూరు మున్సిపల్ స్కూలు ర్యాంకులు పండించడం ఆనందంగా వుంది. కృషితో దుర్భిక్షాన్ని పోగొట్టారనడానికి ఇదొక సాక్ష్యం. నేడు పండగ, రేపు దండగ అనే సామెతలాగా జాతీయ పర్వదినాలు ఉండకూడదు. పొన్నంగి పక్షి గుంద్రని గూడు బాగుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

ఇంద్రధనుస్సే

ఈ వారం 'చరిత్ర బురుజు పై జాతీయ పతాక' అట్టమీది కథ దేశభక్తితో అందరినీ అలరించింది. 'మనలో మాట' చాలా బాగుంది. 'కవిత్వమ్'లో మినీ కవితలు, గేయాలు, పద్య రచనలు, బాల కవితలు వస్తే బాగుంటుంది. ఇష్టపడి పనిచేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్న నెల్లూరు జిల్లా మున్సిపల్ స్కూలు హెడ్ మాస్టారి సూచనలు బాగున్నాయి. ఇష్టపడితే కష్టముండదు కదా! 'ఒకరోజు దేశ భక్తులు' అనేది అక్షర సత్యం. స్వాతంత్ర్యం రోజైనా దేశం గురించి ఆలోచించి, మన కర్తవ్యాన్ని మాటల్లోకాక చేతల్లో చూపితే బాగుంటుంది. 'సెల్యూట్' కథ అందించిన పున్నారావుకి అభినందనలు. కలం స్నేహం, హ్యాపీబర్త్‌డే, స్నేహ ముఖచిత్రం రంగుల ఇంద్రధనుస్సులా పాఠకులకు మనోరంజకంగా ఉంటోంది. బాలలు, యువత పాల్గొనే శీర్షికలు పెట్టాలని మా కోరిక.

కలువకోట మురళీధరస్వామి, జగిత్యాల, కరీంనగర్.

కంటతడి పెట్టించే చరిత్ర

'చరిత్ర బురుజుపై స్వతంత్ర పతాక' కవర్‌స్టోరీ విజ్ఞానదాయకంగా ఉంది. లాల్‌ఖిల్లా చరిత్ర విపులంగా తెలియజేసినందుకు ధన్యవాదాలు. వివిధ చారిత్రక దశల్లో స్వతంత్రం కోసం పోరాడిన ఎందరో వీరుల బలిదానాల రక్తపు మరకలు మనల్ని కంట తడి పెట్టిస్తాయి. ప్రజల్ని బానిసల్ని చేసి, కవులు, కళాకారుల్ని బలితీసుకున్న బ్రిటీష్ పతాకాన్ని దించి అక్కడే మన జాతీయ పతాకం ఎగురవేయడం ఆనందించే విషయం.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

భద్రపరుచుకునేలా...

'చరిత్ర బురుజుపై స్వతంత్ర పతాక' విశ్లేషణాత్మకంగా ఉంది. పున్నారావు 'సెల్యూట్' కథ బావుంది. 'వికాసం'లోని సైన్స్ విషయాలు ఉపయోగకరంగా ఉన్నాయి. 'బాలనేస్తాలు'లో పొన్నంగి, చిత్రవిచిత్రం భలేగా ఉన్నాయి. 'మాటలకోట' ఎప్పటికప్పుడు కొత్త పదాలతో ఆకట్టుకుంటోంది. 'జలంలో మ్యూజియం' చిత్రాలు అబ్బురపరిచాయి. కవితలన్నీ భావగర్భితంగా ఉన్నాయి. 'ఈ పేజ్' విలువైన విషయ సరంజామాతో ఫైల్ చేసుకునేలా ఉంటోంది. 'సినిమా కబుర్ల'లో విశ్వనాథ్ ఇంటర్వ్యూ ఆకట్టుకుంది. ఇజ్రాయిల్‌లో షబ్బాత్ గురించి 'చూద్దామా'లో తెలుసుకున్నాం. 'ఎవరి గోల వారిదే' శీర్షిక కొనసాగిస్తే బాగుంటుంది. 'మనలో మాట'... లాభం లేనిదే దేవుడికైనా మొక్కేరోజులు కావివి. సమాజం అలా తయారైంది మరి.

నేమాన సుభాష్ చంద్రబోస్, శ్రీకాకుళం.

ఆకట్టుకున్న ఇంటర్వ్యూ

గవర్నమెంట్ స్కూల్లో పిల్లలందరూ ఫస్టుక్లాసులో పాసవడమే కాదు ర్యాంకులు తెచ్చుకుంటున్నారంటే అది మామూలు విషయం కాదు. ఇందుకోసం ఆ స్కూలు సిబ్బంది చేసిన, చేస్తున్న కృషి అభినందించదగినది. 'ఈ పేజ్'లో ఇంటర్నెట్ గురించి, దాని ఆవిర్భావం, అందులోని సమాచారం ఎంతుందో అనే వివరాలు చక్కగా చెప్పారు. విశ్వనాథ్ ఇంటర్వ్యూ ఇంత వివరంగా చదవడం ఇదే



మొదటిసారి. 'సెల్యూట్' కథ వైవిధ్యంగా, మంచి ముగింపుతో ఇవ్వడం బాగుంది. 'ఎవరి గోల వారిదే' శీర్షిక బాగుంటోంది. ప్రపంచంలో ఏమూల ఏం జరుగుతోందో తమాషాగా చెప్తున్నారు.

తులసి, విజయవాడ.

పుట్టుపూర్వోత్తరాలు

లాల్ ఖిల్లా పుట్టు పూర్వోత్తరాల గురించి, దాని నిర్మాణం గురించి, బ్రిటీష్ వారు దాన్ని స్వాధీనం చేసుకోడానికి చేసిన ప్రయత్నం, అందులో భాగంగా వేల మంది ప్రాణాలు కోల్పోవడం... ఇలా అనేక విషయాలను తెలుసుకునేలా ఈ వ్యాసం ఉంది. అలాగే స్వతంత్ర దినోత్సవం రోజు మొత్తం పండగ ఎందుకు?జెండా ఎగరేసేవరకు ఉంటే చాలన్నట్లు కొందరు ప్రవర్తిస్తున్నారు. 'సెల్యూట్' కథ, కె.విశ్వనాథ్ ఇంటర్వ్యూ బాగుంది.

వెంకట్రావు, ఒంగోలు.





ENTERED

బంగారం బుడగ!

జెన్నిఫర్ లోపెజ్, మార్క్ అంటోని

'పలుకే బంగారమాయె' అని కంచర్ల గోపన్న అనే భక్త రామదాసు 17వ శతాబ్దంలో శ్రీరాముడి గురించి రాశాడుగాని అదే ఈ రోజుల్లో ఉండి ఉంటేనా 'బంగారమే భారమైపోయె' అని రాయకుండా ఉంటాడా? రామదాసు సంగతి పక్కన పెడితే జలగలు రక్తాన్ని మాత్రమే పీలుస్తాయన్నది తెలిసిందే. జార్జి సోరస్ వంటి డబ్బు జలగలు 'డబ్బు' ను మాత్రమే పీలుస్తాయి. బంగారం ధర పది గ్రాములు మూడు పదుల వేలకు దగ్గరౌతుండటంతో 'కోడిగుడ్డంత' బంగారం ఉన్నవారు సంతోష పడుతుంటే 'చిన్నమెత్తు' కూడా లేని వారు చింత పడుతున్నారు. అయితే బంగారం ధర 'బుడగ' కూడా ఏ క్షణంలో అయినా పేలిపోవచ్చన్న సూచనలు కనిపిస్తున్నాయ్, 'లాభం' కోసం కొత్తగా కొనేవాళ్లు 'తస్మాత్ జాగ్రత్త'. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో 'కూరుకు పోవటంతో' డబ్బు జలగలు 'బంగారం' వైపు మరలాయి. అందుకే 'ఇంతలా' రోజురోజుకూ ధరలను 'పెంచేస్తున్నారని' చెబుతున్నారు. అమెరికాలో 2008లో 'తనఖా బుడగ' పేలిపోయినట్లే ఇపుడు 'బంగారం బుడగ' పేలటానికి తరుణం ఆసన్నమైంది. ఈ ఏడాది ఇప్పటికే బంగారం 'ముందస్తు ధరలు' 26 శాతం పెరిగాయి. ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలు, ఉద్దీపనలకు 'రోజులు దగ్గర' పడ్డాయని జార్జి సోరస్ వంటి వారు 'ముందు జాగ్రత్త' పడుతూ 'బంగారం' నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించి 'లాభాలు' తీసుకొనేందుకు సిద్ధపడుతున్నారని వెల్స్ ఫార్గో అనే సంస్థ మదుపుదార్లను తాజాగా హెచ్చరించింది.

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు

ఎన్నికలనగానే 'ఎన్నికలల్లోనో' ఉంటారు కొందరు. ప్రజాస్వామ్యం గొప్పతనమేమంటే ఎన్నికలలో పోటీ చేసే వారికి కనీస వయస్సు, నామినేషన్ వేసేందుకు అవసరమైన డబ్బు, ప్రతిపాదనకు కనీసంగా ఉండాల్సిన ఓటర్లు ఉంటే చాలు, ఎవరైనా పోటీ చేయవచ్చు. 'బుర్ర' ప్రపంచ చరిత్ర గురించి 'కనీస పరిజ్ఞానం' ఉండాల్సిన అవసరం లేదని ప్రపంచ 'అగ్రరాజ్యం' అమెరికా అధ్యక్ష పీఠం కోసం రిపబ్లికన్ పార్టీలో పోటీ పడుతున్న మిచెల్లీ బాచ్‌మన్ రుజువు చేశారు. తమ పార్టీ ఎన్నికల ప్రచార సభలో ఆవిడగారు మాట్లాడుతూ 'సోవియట్ యూనియన్ ఎదుగుదలను' చూసి అమెరికన్లు 'విపరీతంగా ఆందోళన' చెందుతున్నారట. సోవియట్‌ను కూల్చివేసిన రెండు దశాబ్దాల తరువాత కూడా ఆమె ఇంకా 'కమ్యూనిస్టు వ్యతిరేక మానసిక జబ్బు' నుంచి కోలుకోలేదని తేలిపోయింది. 'ఆత్రగాడికి బుద్ధి మట్టు' అన్నారు గాని బాచ్‌మన్ వంటివారిని గనుక చూసి ఉంటే సామెతలో 'ఆత్రగత్తె'ల గురించి చేర్చి ఉండేవారు. సుప్రసిద్ధ హాలీవుడ్ నటుడు ఎల్విస్ ప్రెస్లీ మరణించిన రోజున 'హ్యాపీ బర్తడే' చెప్పిన ఘనురాలు. 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు, నాకేమి పోవును' అన్నట్లుగా చైనా, భారత్‌ల పెరుగుదలతో పాటు 'సోవియట్ ప్రమాదం' గురించి కూడా పార్లమెంట్ సభ్యురాలు కూడా అయిన ఆమె సెలవిచ్చారు.

అది స్కూలా! రేపిస్టుల కేంద్రమా!!

అమెరికాలోని మిస్సోరీ పాఠశాలను చూస్తే అలాంటి అనుమానమే కలుగుతోంది. 'అమ్మాయిలు రెచ్చగొట్టే' విధంగా లేకపోతే అసలు రేపులెందుకు జరుగుతాయనే 'బాపతు'కు అమెరికాలో కొరతేమీ లేదు. అమెరికాలో వయస్సు మీరిన, లేదా ఇతరత్రా సమస్యలున్న విద్యార్థులకు ప్రత్యేక బోధన ఉంటుంది. అలాంటి ఒక ఏడవ గ్రేడ్ విద్యార్థినిపై తోటి విద్యార్థి అత్యాచారం జరిపాడు. అయితే అలాంటిదేమీ జరగలేదని, తప్పుడు ఫిర్యాదు చేసినందుకు క్షమించాలని లేఖ రాసి 'స్వయంగా' అబ్బాయి 'చేతికి' అందించాలని స్కూలు అధికారులు ఆదేశించారు. తప్పనిసరై ఆమె అలాగే చేసింది. ఆ కుర్రాడు 'మరోసారి' ఆమెపై అత్యాచారం చేశాడు. అయితే పిల్లల కోర్టుకు ఈ కేసు వెళ్లటంతో ఆ కుర్రాడు తానేం చేస్తున్నానో తెలియని స్థితిలో 'ఏమైనా చేస్తే చేసి ఉండవచ్చని' ఒప్పుకున్నాడు. అయితే స్కూలు యాజమాన్యం బాలిక రెండవసారి చేసిన 'ఫిర్యాదు'ను కూడా అంగీకరించకపోగా స్కూలు నుంచి సస్పెండ్ చేసింది. ఇలాంటి ఫిర్యాదులు వచ్చినపుడు ఉన్నతాధికారులకు తెలియచేయాల్సి ఉండగా ఆ పని కూడా చేయలేదు. సస్పెన్షన్ తరువాత స్కూలులో చేర్చుకొనేందుకు తిరస్కరించారు. ఆ పిల్ల చెప్పిందానిని తాము 'నమ్మటంలేదని' అవసరానికి అనుగుణంగా 'మాట్లాడే రకమని' నిందించారు. దాంతో ఆమె తల్లిదండ్రులు స్కూలు యాజమాన్యంపై కోర్టులో కేసు వేశారు.

బ్రేకింగ్ న్యూస్

ఇల్లు తగులబడుతుంటే చుట్ట కాల్చుకొనేందుకు నిప్పు బలే దొరికిందని వెనకటికెవడో సంబర పడ్డాడట. ప్రపంచాన్ని ఆవరిస్తున్న సంక్షోభంతో ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన పడేవారు ఎందరో అయితే కొందరికి అవేం పట్టవు. హాలీవుడ్ నటి జెన్నిఫర్ లోపెజ్, నటుడు మార్క్ అంటోని భార్యాభర్తలు. తాము విడిపోతున్నట్లు ప్రకటించారు. అది జరిగి నెలరోజులు కూడా గాక ముందే తిరిగి ఒక బీచ్‌లో కలుసుకున్నారట. ఎందుకు కలుసుకున్నారన్నది కొన్ని ఛానళ్లు, పత్రికలకు పెద్ద బ్రేకింగ్ న్యూస్. హాలీవుడ్‌లో అసలు ఎందుకు పెళ్లి చేసుకుంటారో, ఎందుకు విడిపోతారో అర్థంగాని బ్రహ్మపదార్థం.

లండన్ తగలడటానికి అసలు కారణం !!

బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరాన్ ఉరుమురిమి మంగలం మీద పడ్డట్లు లండన్ తగలడి పోవటానికి వ్యక్తుల విధులను విస్మరించి 'మానవహక్కుల' గురించి 'వక్రీకరించటం' 'తప్పుడు వ్యాఖ్యానాలు' చేయటమే అసలు కారణమని తేల్చారు. అదేమిటో మాత్రం సెలవివ్వలేదు.'లివింగ్ చర్చ్ ఆఫ్ గాడ్' అనే మత శాఖకు చెందిన జాన్ మెకిన్ అనే పెద్దమనిషి 'అతని కంటే ఘనుడు కామెరాన్' అన్నట్లు ఐదుగురు ప్రాణాలు కోల్పోవటానికి 120 ప్రాంతాలు తగలడటానికి సమాజంలో నైతిక విలువలు మృగ్యం కావటమే కారణాలని సెలవిచ్చాడు.

అమెరికా వేలు పెడితే అంతే.....

అమెరికా 'వేలు, కాలు' పెట్టనంత వరకు ఏ ప్రాంతమైనా సుఖంగా ఉంటుంది. ఇరాక్‌పై దాడి చేయకముందు అక్కడ ఉగ్రవాద సమస్య లేదు. ఉగ్రవాదంపై పోరు పేరుతో అమెరికా ఎక్కడ వాలితే అక్కడ 'మూడు ఆల్‌ఖైదాలు-ఆరుగురు బిన్‌లాడెన్' లు పుట్టుకు వస్తున్నారు. ఇరాక్‌లో 'ఉగ్రవాదుల' వెనుక కొన్ని 'విదేశీ శక్తులు' ఉన్నాయని అమెరికా ఆరోపించింది. అంటే ఉగ్రవాద పోరు కొనసాగింపునకు మరోదేశంపై యుద్ధానికి 'సాకులు' నిల్వచేసుకుంటున్నది. అసలు కారణమేమంటే ఈ ఏడాది 'డిసెంబరు తరువాత కూడా' ఇరాక్‌లో తిష్టవేసేందుకు అమెరికా సాకులు వెదకటమే ఇటీవల జరుగుతున్న తిరుగుబాటుదార్ల గెరిల్లా దాడులకు కారణంగా చెబుతున్నారు.

- ఎం. కోటేశ్వరరావు

ఆన్‌లైన్‌లోనే మూవీలు... సెల్‌ఫోన్‌లోనే సినిమాలు చూస్తున్న కాలమిది. ఇక ఇంటర్నెట్‌లో సినిమాలు చూడ్డం అంటే పెద్ద విశేషమేకాదు. గడపగడపకీ కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చాక ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండా వుంటుందా? అందులోనూ తక్కువ రేటుకే హైస్పీడ్ నెట్ కనెక్షన్స్ లభ్యమవుతున్నాయి. దీంతో అనేక రంగాలలో ఇంటర్నెట్ వినియోగం బహుళ ప్రజాదరణ చూరగొంటున్నది. వీటిలో సినిమాలు ఒకటి.

ఆన్‌లైన్ సినిమాలు

సినిమాలను ఇంటర్నెట్‌లో కూడా రిలీజ్ చేస్తున్న ప్రస్తుత తరుణంలో అనేక ఆన్‌లైన్ సర్వీసులు నెట్‌లో సినిమాలు అందిస్తున్నాయి. వీటిలో యాహూ, గూగుల్ వంటి ప్రముఖ సంస్థలు కూడా వున్నాయి. యాహూ 'మూవీప్లెక్స్'ను ప్రారంభించడంతో ప్రత్యర్థి సంస్థ గూగుల్‌తో పోటీ మరింత తీవ్రం కావొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. గూగుల్ ఇప్పటికే తన యూట్యూబ్‌లో బాక్సాఫీస్ సర్వీస్‌తో ఉచితంగా ఆన్‌లైన్ సినిమాలు అందిస్తోంది. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సైతం ఆన్‌లైన్లో సినిమాలను అద్దెకు అందించే ప్రయత్నాల్లో ఉంది. ఇక బిగ్‌ఫ్లిక్స్‌తో కలిసి ఎయిర్‌టెల్ కూడా ఆన్‌లైన్ వీడియో కంటెంట్‌ను అందిస్తోంది. కొన్ని కంపెనీలు ఈ సర్వీసును ఉచితంగానే అందిస్తున్నా.. కొన్ని చార్జీలు వసూలు చేస్తున్నాయి. ఇంతకుముందు ఏదైనా నచ్చిన సినిమా చూడాలంటే వీడియోకేఫ్‌ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా సమస్యలేదు. భాష ఏదైనా నచ్చిన సినిమా చూసే అవకాశం వుంది. అంతేకాదు... ప్రస్తుత అత్యంత ఆదరణ పొందుతున్న టీవీషోలు, సీరియళ్లు సైతం నెట్‌లో దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా టీవీలో సీరియళ్లు చూసేవారు ఒక చానల్‌లో వచ్చే సీరియల్ చూస్తూవుంటే, మరో చానల్‌లో వచ్చే సీరియల్ మిస్సవుతుందనో, ఇతర పనులపై బయటికి వెళ్ళినప్పుడు రోజూ చూసే సీరియల్ చూడలేకపోయామనో తెగ బాధపడిపోయేవారు అనేకమంది వున్నారు. తెలుగులోని అన్ని చానళ్లలోనూ వచ్చే సీరియళ్ల అన్ని భాగాలనూ ఇప్పుడు నెట్‌లో పెడుతున్నారు. దీంతో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య నానాటికీ పెరుగుతోందనే చెప్పాలి. ఆన్‌లైన్ రీసెర్చ్ సంస్థ కామ్‌స్కోర్ ఈ ఏడాది మార్చిలో విడుదల చేసిన నివేదిక ప్రకారం భారత ఇంటర్నెట్ వినియోగదారులు ఆన్‌లైన్ వీడియోలను చూసేందుకు ప్రతి నెలా సగటున 910 కోట్ల నిమిషాలు కేటాయిస్తున్నారు. ఇందులో న్యూస్, స్పోర్ట్స్ కన్నా ఎంటర్‌టైన్‌మెంట్ వీడియోల వాటానే ఎక్కువగా ఉంటోంది. ప్రతి నెలా ఇండియాలో సుమారు 3 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదార్లు 170 కోట్ల వీడియోలను చూస్తున్నారని అంచనా.

యాహూ 'మూవీప్లెక్స్' : అంతర్జాల దిగ్గజం యాహూ ఇండియా కొత్తగా ఆన్‌లైన్‌లోనే సినిమాలను అందిస్తోంది. ఈ సౌకర్యం కోసం 'మూవీప్లెక్స్' పేరిట ప్రత్యేక. సర్వీసును యాహూ ప్రారంభించింది. ఈ సర్వీస్ ద్వారా పైరసీ భూతానికి చెక్ పెట్టడమే కాకుండా, సినిమాలను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేకుండానే ఉచితంగా ఆన్‌లైన్‌లోనే వీక్షించవచ్చు. ప్రస్తుతం మూవీప్లెక్స్‌లో ఆక్రోష్, దిల్ తో బచ్చా హై జీ, రాక్ ఆన్, రణ్, లమ్హా, క్రూక్, రక్త చరిత్ర, రక్త చరిత్ర-2 తదితర చిత్రాలను అందుబాటులో ఉంచినట్లు యాహూ తెలిపింది. ఆన్‌లైన్లో బాలీవుడ్ సినిమాలను అందించేందుకు వివిధ సినీ నిర్మాణ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు వివరించింది.

గూగుల్ 'యూట్యూబ్' : ఇంటర్నెట్‌లో మరో దిగ్గజం గూగుల్ ఇప్పటికే తన యూట్యూబ్‌లో అనేక సినిమాలను అందిస్తోంది. యూట్యూబ్‌లో అన్ని రకాల అంశాలకు సంబంధించిన వీడియోలను వీక్షించవచ్చు. ఇదే యూట్యూబ్‌లో సినిమాలకూ ప్రత్యేక స్థానం వుంది. తెలుగుతో పాటు అన్ని భాషల్లోని సినిమాలూ దీనిలో లభ్యమవుతాయి. ఈ యుఆర్‌ఎల్ టైప్ చేసి చూడండి. నచ్చిన సినిమాను ఆస్వాదించండి.
http://www.youtube.com/movies/indian-cinema?fl=f&l=te&pt=g&st=f

భారత్ మూవీస్ : ఆన్‌లైన్ సినిమాలు అందిస్తున్న వెబ్‌సైట్లలో 'భారత్‌మూవీస్ డాట్‌కామ్' ఒకటి. దీనిలో హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, బెంగాలి, మరాఠీ భాషల్లో అనేక సినిమాలు లభ్యమవుతున్నాయి. ముఖ్యంగా తెలుగులో 1940 తర్వాత వచ్చిన సినిమాల దగ్గర నుండి కొత్తగా నిన్నా మొన్నా రిలీజ్ అయిన సినిమాల వరకు ఈ సైట్‌లో లభ్యమవుతాయి. సంవత్సరాల వారీగానూ లేదా అక్షర క్రమంలోనూ ఈ సినిమాలను ఎంపిక చేసుకొనే అవకాశం వుంది. అంతేకాకుండా సినిమా కార్యక్రమాల వీడియోలతోపాటు వార్తలకు సంబంధించిన వీడియోలు కూడా లభ్యమవుతున్నాయి. http://bharatmovies.com

మన తెలుగు మూవీస్ : ఇదో అద్భుతమైన తెలుగు సైట్. ఈ సైట్‌లో తెలుగు సినిమాలతోపాటు తెలుగులోని వివిధ ఛానల్స్‌లో వస్తున్న టీవీషోలు, సీరియళ్లు, న్యూస్ క్లిప్పింగ్‌లను సైతం అందుబాటులో వుంచారు. సినిమా రిలీజ్ అయిన రెండు మూడు రోజుల్లోనే ఈ సైట్‌లో ప్రత్యక్షం అవుతుందంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఇతర భాషలనుండి తెలుగులోకి అనువదించబడిన సినిమాలు సైతం ఇందులో వున్నాయి. http://www.manatelugu-movies.net/

తెలుగు నగర్ : మరో ముఖ్యమైన తెలుగు సైట్ 'తెలుగునగర్ డాట్‌కామ్'. తెలుగుతోపాటు హిందీ, ఇంగ్లీష్ సినిమాలు సైతం ఈ సైట్‌లో లభ్యమవుతాయి. ఈ సైట్‌లోకూడా సినిమా రిలీజ్ అయిన రెండు మూడురోజుల్లోనే ఈ సైట్‌లో ప్రత్యక్షం అవుతాయి. http://telugunagar.com/

ఇవేకాకుండా వేలాది సైట్లు ఇంటర్నెట్‌లో సినిమాలను అందిస్తున్నాయి. వాటిలో కొన్నింటిని ఈ దిగువనిస్తున్నాం.

♦http://www.telugustudio.net/
♦http://meetelugu.com/movies/
♦http://movies.rangu.com/ ♦ http://www.moovyshoovy.com/
♦http://www.telugumovieonline.net/hdmovies/
♦ http://www.indiaeveryday.in/video/l/telugu.htm
http://www.bindaasbharat.com/
♦http://www.onlinewatchmovies.net/movie-list/movie-list.html
♦http://www.onlinemovie4u.net/
♦http://www.bharathcinemas.info/category/watch-telugu-movies-online/ ♦ http://www.moviebeat.in/

వెబ్‌సైట్లు ఆన్‌లైన్‌లో సినిమాలను ఉచితంగా అందించినా.. అడ్వర్టైజ్‌మెంట్ల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి. యూజర్లు సినిమాను ఫుల్ స్క్రీన్‌లో కూడా చూడవచ్చు. అలాగే, లింక్‌ను సోషల్ నెట్‌వర్క్ ద్వారా తమ స్నేహితులకు పంపించవచ్చు. కానీ, తగిన స్థాయిలో బ్యాండ్‌విడ్త్ ఉంటేనే ఈ ఆన్‌లైన్ సినిమాలను ఆస్వాదించడం సాధ్యం.

-కె.ఎక్స్.రాజు

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...

సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీషులో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ **ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:**

CHENNAI:

0-9789099589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

.... Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

కథ

జనని మంచం మీదనుండి లేవకముందే ఫోన్ మోగింది. ఇంత ఉదయాన్నే ఎవరా అని తీసి "హలో" అంది.

"అమ్మా! నేను రచనను. నాకు పెద్ద ప్రాబ్లమ్ వచ్చి పడింది. కుమార్ ఈ రోజు ఇంట్లోనే వుంటాడట. నన్నే వంట చేయమంటున్నాడు. ఎలానో ఏంటో?" అంది పెద్ద కూతురు రచన.

కూతురి మాటలకు జనని గుండెలు జారిపోయాయి. తమాయించుకుని "అమ్మడూ! ఏం చెయ్యమన్నా కంగారు పడకుండా ఆలోచించి చెయ్యి. భోజనానికి కూర్చునే ముందు రుచి చూడు. ఉప్పూ కారాల్లో ఏది తక్కువైతే అది చిటికెడు కలుపుకుని తినెయ్యండి. అల్లుడిముందు ఊరికే గాభరా పడకు. సరేనా?" అంది జనని.



రమ్యమైన భోజనం

- తమ్మెర రాధిక

ఇంజనీరింగ్ అయిపోయిన ఆర్నెల్లలోపే మంచి సంబంధం వచ్చిందని పెళ్ళి చేసేశారు. పెళ్ళి చూపుల్లోనే అబ్బాయి రచనని ఉద్యోగం చేసే ఆలోచన ఉందా అని అడిగాడు. మళ్ళీ తనే ఉద్యోగం అనేది తన వరకూ మరీ ముఖ్యమైన విషయం అనుకోవట్లేదని చెప్పాడు. రచన మాత్రం తనొక మంచి హోదాలో ఉండడం కోసమే కష్టపడి చదివాననీ, తప్పని సరిగా ఉద్యోగం చెయ్యాలనుకుంటున్నాననీ చెప్పింది. ఎప్పుడూ పుస్తకాల్లో తలదూర్చి చదువుతూనే ఉండేది.

రచన కంటే చిన్నది సాహితి. అదెప్పుడూ తల్లినీ, అక్కనీ విమర్శిస్తూ ఉండేది. చదువొక్కటే లోకం కాదు, అన్ని రంగాల్లోనూ తెలివితేటలు చూపించాలనేది.

అక్కతో వాళ్లత్తగారింటికి వెళ్లిన సాహితి వాళ్ల భోజన రుచులు చూసి తబ్బిబ్బయిపోయింది. అక్క అత్తగారూ, ఆడబడుచులూ, తోడికోడళ్లూ ... అందరూ వంట చేయడంలో నలభీములేనని విని అక్కని చూసి జాలిపడింది. ఆ మాటే తల్లితో కూడా చెప్పింది.

"అమ్మా! పెళ్లంటే మా ఫ్రెండ్స్ ఏమంటారంటే ఎంగేజ్‌మెంట్ రింగ్, వెడ్డింగ్ రింగ్, సఫరింగ్ అని జోక్ చేస్తారు. అక్కకు మొదటి రెండూ అయ్యాయి. ఇప్పుడు మూడోది మొదలౌతోంది" అంది సాహితి తల్లితో.

అప్పుడు ఆమె మాటలు ఇంట్లో అందరూ చాలా తేలిగ్గా తీసుకున్నారు. జనని ఆలోచిస్తోంది ఈ రోజెలాగో ఏమోనని. భర్తా పిల్లలూ లేచినట్లున్నారు. ఇంట్లో మాటలు వినిపిస్తున్నాయి. పేపర్ తీసుకుని లోపలికొచ్చింది.

"ఇందాక రచన ఫోన్ చేసింది. అల్లుడు ఇవాళ దాన్ని వంట చెయ్యమన్నాడట" అంది జనని. తండ్రి భుజాలమీద చేతులేసి "నే చెప్పలేదూ! ఏదో ఒకరోజు ఇలాంటి స్థితి వస్తుందని" అంది సాహితి.

రామారావు పేపర్లో తల దూర్చి మిన్నకుండిపోయాడు.

"నిజమే" అనుకుంది జనని. పిల్లలు చదువులంటూ హాస్టళ్లలో ఉండడమూ, ఇంటికొచ్చినప్పుడు కూడా అలసటంటూ ఏ పనీ చెయ్యకపోవడమూ ప్రతి ఇంట్లోనూ మామూలైపోయింది. రచన సెలవలకు ఇంటికొచ్చినా ఏ పనీ చెయ్యదు. వస్తూ వస్తూ బండెడు పుస్తకాలు వెంట తెచ్చుకుని వాటిముందే ఇరవైనాలుగ్గంటలూ కూర్చునేది.

అలా ఆలోచిస్తూ రచనకు ఫోన్ చేసింది.

"అమ్మడూ! అల్లుడిగారిముందు ఊరికే కంగారు పడకు. ముందు రెండు గ్లాసుల బియ్యం కడిగి కుక్కర్‌లో పెట్టు. రెండు విజిల్స్ వచ్చాక దింపి పక్కన పెట్టు" అంది.

"అసలు బావగారు అక్కని ఏం వండమన్నారో కనుక్కోమ్మా!" అంది సాహితి.

"ఆలూ ఫ్రై, టమాటా పచ్చడి, రసం వండమన్నారట" అంది తల్లి.

తల్లి దగ్గరి ఫోన్ లాక్కుని "అక్కా! కూర సంగతి నేను చెబుతాను" అంటూ అక్కకి బంగాళదుంప కూర ఎలా చెయ్యాలో చెప్పింది సాహితి.

ఇదంతా విన్న రచన ఏం చేసిందో ఏమో గానీ సాయంకాలానికి కుమార్ ఫోన్ చేసి "మీ అమ్మాయికి టెన్షన్ ఎక్కువ. వంటల్లో మెలకువలు చాలా నేర్చుకోవాలి. మనం సంపాదించుకునేది ఎందుకు? కమ్మగా వండుకుని తినడానికేగా. మీ అమ్మాయి మాత్రం ఎంతసేపూ 'హోటల్ నుండి పార్సిల్ తెచ్చుకుందాం' అంటుంది" అన్నాడు.

"అక్క వంటపై శ్రద్ధపెడితే బ్రహ్మాండంగా చేస్తుంది. దాని పాకనైపుణ్యం మాకు తెలుసు కదా. నాలుగు రోజులు ఓపిక పట్టండి బావగారూ" అంది సాహితి.

కుమార్ నవ్వి ఫోన్ పెట్టేశాడు. అప్పటికా గండం తప్పిందనుకున్నారంతా. మర్నాడు జనని చింతకాయ, గోంగూర, టమాటా లాంటి పచ్చళ్లు రోట్లోనూరి కవర్లలో ప్యాక్ చేసి కూతురికి కొరియర్‌లో పంపింది.

అత్తగారు పంపిన పచ్చళ్లు బాగున్నాయనీ, వాటిని ఎలా తయారు చేయాలో చెప్పమని అడిగాడు కుమార్. ఆవిడ చెబుతుంటే రాసుకున్నాడు కూడా.

రెండ్రోజుల తర్వాత రచన ఫోన్ చేసింది.

"అమ్మా! కొన్నాళ్లు నాకోసం ఎలాగైనా కష్టపడవే. ఈయనగారి రుచులతో చచ్చిపోతున్నాననుకో. నువ్వు పంపిన పచ్చళ్లు చూసి తన ఫ్రెండ్స్‌ని భోజనానికి పిలిచాడు. వాళ్లేమో అవి తిని చాలా బాగున్నాయని తెగ మెచ్చేసుకున్నారు. ఇప్పుడు కుమార్ నన్నూ అలా చెయ్యమంటున్నాడు. ఇవన్నీ చేసుకుంటూ కూర్చుంటే ఎలాగమ్మా. నా వల్ల కాదు. అసలే ఇప్పుడు ప్రమోషన్ లిస్టులో ఉన్నాను. వర్క్ క్వాలిటీ ఉండాలి కదా. పొద్దున్నే వెళ్తే రాత్రవుతుంది వచ్చేసరికి. ఓపిక ఉండడం లేదు. ఒకటే నీరసం. ఒకసారి డాక్టర్ దగ్గరికి వెళ్లి కన్‌ఫాం చేసుకోవాలి" అంది నీరసంగా.

"శుభవార్తేనా రచనా?" అడిగింది సంతోషంతో జనని.

"అవునమ్మా! అయినా ఇప్పుడే ఏం తొందర అనిపిస్తోంది నాకు"

"పిచ్చిదాన్లా ఆలోచించకు. ఇప్పుడే కావాలి సంతానం. ప్రమోషన్ రాకపోయినా పర్వాలేదు. అబార్షన్ చేయించుకోవాలన్న అలోచనే రానీయకు" కూతురితో చెప్పింది ఆదుర్దాగా.

"పోమ్మా. నా బాధ నీకేం తెలుసు?"

"ఓసేయ్... నీకేమయినా పిచ్చి పట్టిందా? రెండ్రోజుల్లో బయల్దేరుతున్నాను. ఈలోపు తలతిక్క నిర్ణయాలు తీసుకోకు" కూతురిమీద కోప్పడింది జనని.

ఇంట్లో అంతా ఆలోచించి జననిని రచన దగ్గరికి పంపారు.

వెళ్తూ వెళ్తూ ఐదారు రకాల పొడులూ, పచ్చళ్లూ చేసుకుపోయిందామె.

కుమార్ స్టేషన్‌కి వచ్చి తీసుకెళ్లాడు. ఆ ఇంటిని చూస్తేనే తెలుస్తుంది రచన ఏ విషయంలో ఎంత శ్రద్ధ వహిస్తుందో. రెండు రోజుల్లోనే ఆ ఇంటి పరిస్థితి పూర్తిగా ఆకళింపు చేసుకుంది.

"పెళ్లి కాకముందు ఉద్యోగం చేశావు. సరే. ఇప్పుడో ఏడాది రెస్ట్ తీసుకో. హౌస్‌వైఫ్‌గా సంతోషంగా ఉండు. నాకు కమ్మగా వండిపెట్టు. ఈ ఉద్యోగం స్ట్రెస్‌లో పడి తిండి విషయంలో అమ్మను చాలా మిస్సయ్యాను" అని కుమార్ చెప్పినా...

"షిట్!" అంటూ ఆమెలో అహం చర్రున లేచింది. తను ఎంతో చదువుకుంది. వ్యక్తిత్వం ఉంది. అలాంటిది భర్త భోజనం కోసం ఇప్పుడు తను ఉద్యోగం చెయ్యకుండా వంటింట్లో పడుండాలా? నెవ్వర్! అంటూ ఉద్యోగాన్ని కంటిన్యూ చేస్తోంది.

"కాస్తయినా రుచిగా వండడం నేర్చుకుంటే మీ ఇద్దరి మధ్యా ఈ కలహాలు వచ్చేవి కావు" అన్న తల్లి మాటలకు విసుగ్గా చూసింది రచన. పెళ్లయ్యాక భర్తకు బాంబేలో ఉద్యోగమని తనూ అక్కడే ఉద్యోగం చూసుకుంది. వచ్చిన రెండు నెలలలోపే ఆమెకు వంట రాదని తెలిసి హతాశుడయ్యాడు.

అత్తగారు వచ్చిన సందర్భంగా ఆఫీసుకు లేటుగా

వెళ్తానన్నాడు కుమార్. భోం చేసి వెళ్తానని చెప్పేసరికి గబగబా కుక్కర్‌లో అన్నం పప్పు పెట్టి, ఫ్రిజ్ తెరిచి చూసింది. అందులో కూరగాయల్లాంటివేమీ లేవు.

"మామిడికాయ పప్పు నాకిష్టం అత్తయ్యా! కానీ దాన్లో అవేమీ ఉండవు" అతని మాటలకి కూతురుకేసి ఇదేం పనన్నట్లు చిరాగ్గా చూసింది.

"ఇవ్వాళ్టికి బీన్స్ కూర చెయ్యమ్మా. తరిగిపెట్టాను" అంది అంది కూతురు.

"ఛీ... ఛీ... రోగిష్టి వాళ్లలా నేనది తినను" అన్నాడు అల్లుడు.

"ఒక్క నిమిషం ఆగండి అల్లుడు గారు" అంటూ తను తెచ్చిన మాగాయ పచ్చడి తీసి తాలింపు వేసింది. సాంబారు కాచింది.

వేడివేడిగా అన్నంలో పప్పు, మాగాయ, సాంబారు, బండ పచ్చడి, పెరుగుతో తృప్తిగా తినేసి ఆఫీసుకు వెళ్లాడు.

అతనెళ్లాక రచన ఆఫీసుకు తయారవుతుంటే "ఈ రోజు సెలవు పెట్టవే. భోంచేసి కాసేపు హాయిగా మాట్లాడుకుందాం" అంటూ టేబుల్ మీద కంచాలు పెట్టింది.

"పోయిన నెల ఫుడ్ ఫెస్టివల్ అంటూ వారం రోజులు సెలవు పెట్టించి అంధేరీ లాక్కుపోయాడు. ఇప్పుడు సెలవంటే కష్టం. నువ్వుండగానే ప్రెగ్నెన్సీ తీయించుకుంటే రెండ్రోజులు వుండి చూసుకుంటావు కదమ్మా" అంది రచన.

"రచనా! అసలు నువ్వు నీ కడుపులో పిండానికి తల్లివేనా? దాన్ని చంపుతానంటున్నావే... ఆ మాత్రం దానికి నేను రెండ్రోజులుండి నీకు సేవలు చెయ్యాలా?" అంది కోపంగా.

"ఏంటమ్మా! కోప్పడుతున్నావు?"

"ఛ... నోర్ముయ్! మనమేం అమెరికాలోనో, లండన్లోనో పుట్టలేదు. ఎలా పడితే అలా వుండడానికి. అల్లుడుగారు వాళ్లింటికి పెద్ద కొడుకు. మీరు కనబోయే సంతానం గురించి అతని తల్లిదండ్రులకు ఎన్నో ఆశలుంటాయి. మీ నాన్నగారైతే నీకు పుట్టబోయే బిడ్డ కోసం ఇప్పటి నుండే అవి కొనాలి, ఇవి కొనాలంటూ సాహితితో చెప్పి ఎంత మురిసిపోతున్నారో తెలుసా? బిడ్డను కని నువ్వు చంటి కూనను ఎత్తుకుని ముద్దాడుతూ పన్ను చేసుకుంటుంటే మాకు ఎంత సంతోషంగా ఉంటుందో తెల్సా? ఉద్యోగానిదేం ఉంది. బిడ్డని మా దగ్గరో, మీ అత్తగారి దగ్గరో ఉంచు. ఆ తర్వాత నీ కెరీర్‌ని డెవలప్ చేసుకో. అంతేగానీ, భ్రూణ హత్య చేసి నీ కెరీర్‌ని నిలుపుకుందామనుకుంటే మాత్రం బాగుండదు" అంది విసుగ్గా.

"నెలకు డెబ్బయి వేలు ఎలా వదులుకోమంటావ్ చెప్పు?"

"నిజమే. ప్రెగ్నెన్సీ తీసేయించుకుని ఉద్యోగంలో స్థిరపడతావు. తర్వాత పిల్లలు పుట్టలేదనుకో. అప్పుడు నీ పరిస్థితి ఏంటి?"

"ఎందుకు పుట్టరు? ఒకవేళ అలాగే జరిగితే సరోగేట్ మదర్ సిస్టం ఉందికదా?" ఎంతో ధీమాగా అంది.

"ఛీ... ఛీ... పిచ్చి వాగుడు వాగి నాకు కోపం తెప్పించకు"

కూతురి సమక్షంలో నిలబడాలంటేనే చిరాకనిపించి అక్కడ్నుండి వేరే గదిలోకి వెళ్లింది.

తల్లికి కోపం వచ్చిందని గ్రహించి ఆఫీసుకు సెలవు పెట్టింది.

"సర్లేమ్మా! ఆకలవుతోంది" అంది దీనంగా తల్లి కోపం పోగొట్టాలన్న ఉద్దేశంతో.

కడుపుతో ఉన్న పిల్ల ఆకలంటుందన్న ఆదుర్దాతో వచ్చి తనే అన్నం కలిపి నెయ్యి వేసి పెట్టింది.

నిజంగానే నోటికి కమ్మగా ఉన్నాయి వంటకాలు.

"కాస్త ఒళ్లొంచి వండుకుంటే ఏదయినా బాగుంటుంది కదమ్మా" అంది రచన నవ్వుతూ.

అత్తగారి వంటలు కుమార్‌కి బాగా నచ్చాయి. రచన లేనప్పుడు అత్తగారితో "ఇంకో నాలుగురోజులుండండత్తయ్యా. వంట విషయంలో మీ అమ్మాయికి ట్రైనింగ్ ఇవ్వండి. చప్పటి వంటలతో నాలుక చవి చచ్చిపోయింది" అన్నాడు.

అల్లుడు రచన గర్భం గురించి మాట్లాడక పోవడం గమనించింది. కూతురు అతని దగ్గర ఈ విషయం దాచిందని గ్రహించింది. మర్నాడు కూతురు ఇంట్లోనే ఉండడం చూసి కావాలనే "రచన మామిడి కాయలు ఇష్టంగా తింటోంది" అంది కూమార్‌తో.

అర్థం కానట్లు భార్యకేసి చూశాడు.

"అమ్మా!" అంది ఆ విషయం అతని సమక్షంలో మాట్లాడ్డం ఇష్టం లేనట్లు.

ఇక ఉండబట్టలేక "మీరు తండ్రి కాబోతున్నారు" అంది అల్లుడితో. ఆ మాటలకు అతను తెల్లబోయాడు. కాసేపు మౌనంగా కూర్చొని అక్కడ్నుండి వెళ్లిపోయాడు.

"అయిందా! అతని మనసేంటో తెలుసుకోకుండా చెప్పేశావు. ఇప్పుడు చూడు నన్ను జాబ్ మానేయమంటాడు. లేదా వాళ్లమ్మని ఇక్కడ తెచ్చి పెడతాడు. నా ఇష్టంగా, సంతోషంగా ఏదీ జరగడం లేదు" రచన గొంతులో అయిష్టత, దుఃఖం ధ్వనించింది.

ఆ రాత్రే అతనితో తన అయిష్టతను చెప్పినట్లుంది. మర్నాడు పొద్దున్నే కాఫీ తాగుతూ "నాకు పిల్లలు కావాలి. కమ్మగా వండి పెట్టే భార్య కావాలి. మీ అమ్మాయి తెచ్చిపెట్టే జీతం నేనాశించడం లేదు. కనే ఒకరిద్దర్నీ ఓపికున్నప్పుడే కనాలి. పెద్దవాళ్ల సంరక్షణలో మా బాధ్యతలు తీరాలి. అంతేగానీ ఉద్యోగం ఉంది కదాని, ప్రమోషన్లు పోతాయని కడుపు తీయించుకుంటే తర్వాత ఏమైనా ఇబ్బందులొస్తే! అలాంటి కేసులు ఎన్ని లేవు మన కళ్లముందు! ఉద్యోగం కావాలంటే ఎప్పుడైనా సంపాదించుకోవచ్చు. పిల్లలు అలా కాదుగా. రచనకు గట్టిగా చెప్పండత్తయ్యా! తన మాటే నెగ్గాలంటే మీ వెంట తీసుకెళ్లొచ్చు" అన్నాడు నిర్మొహమాటంగా.

జననికి ఏం మాట్లాడాలో తోచలేదు. రచనతో కూడా చెప్పకుండా అతను ఆఫీసుకు వెళ్లాడు. అల్లుడితో చెప్పి రెండు టిక్కెట్లు తెప్పించింది జనని. కుమార్ మాట్లాడలేదన్న ఉక్రోషంతో తల్లితో బయల్దేరింది రచన.

◆◆◆

పొట్ట ఎత్తుగా, మొహం కాంతివంతంగా మెరిసిపోతోంది రచన. ఇప్పుడు తనకి ఏడోనెల వచ్చింది. ఇంత వరకు కుమార్ ఒక్కసారి కూడా రాలేదు. వారానికోసారి మాత్రం ఫోన్ చేసి అందరితో మాట్లాడుతున్నాడు. పుట్టింటికొచ్చాక ఆమె రకరకాల వంటలు నేర్చుకుంది. రుచిగా వండుతోంది కూడా. తను చేసిన వంటలు ఇంట్లో అందరూ మెచ్చుకుంటుంటే చాలా సంతోషంగా ఉంది.

"ఇదేం బ్రహ్మవిద్యా ఏంటి రచనా? మా చిన్నప్పుడు గ్యాసుపొయ్యిలూ, మిక్సీలు, గ్రైండర్లూ ఎక్కడివి? అన్నీ కట్టెలపొయ్యిమీదే వండేవాళ్లం. రుబ్బురోట్లో రుబ్బితే ఇడ్లీలు, వడలు ఎంత రుచిగా ఉండేవో. ఇలా రుచికరంగా వండి పెడితే ఏ మగాడు పెళ్లాం కొంగు వదులుతాడు చెప్పు" బామ్మ ఇలా చెప్తోంటే రచనకి కుమార్ గుర్తొచ్చాడు.

"రుచిగా వండి పెట్టడం వల్లేనేమో తాతయ్య బామ్మ కొంగు పట్టుకుని ఇంట్లోనే వుండేవాడు. ఏం చెప్పినా డూడూ బసవన్నలా తలూపేవాడు. అవునా బామ్మా!" సాహితి నవ్వుతూ బామ్మతో హాస్యమాడింది. ఆ మాటలతో అందరూ హాయిగా నవ్వుకున్నారు.

ఈ మాటలు విన్నాక కుమార్‌కి తన వంటలు రుచి చూపించాలనే ఆరాటం రచనలో ఎక్కువైంది. కానీ ఏం లాభం. ఇంకా రెండు నెలలు ఆగాలి. డెలివరీ అయిన తర్వాతే వస్తానన్నాడు.

◆◆◆

"వాళ్లమ్మ పెట్టిన టమాటా పచ్చడంత ఎర్రగా, బాగుంది పాప" లీలగా వినిపిస్తున్న మాటలకు నీరసంగా కళ్లు తెరిచింది రచన. మంచం పక్కనే ఉయ్యాలలోని పాపను వంగి చూస్తున్న కుమార్ కనిపించాడు.

"కుమార్!" సంభ్రమం, ఆనందం కలగలిపిన గొంతుతో పిల్చింది.

"నిజంగా టమాటా పచ్చడి తిన్నావా? నేనే చేశాను. బావుందా?" అందామె.

ఆమె అడిగిన తీరుకు అందరూ నవ్వారు.

కుమార్ మాత్రం "నిజ్జంగా రచనా! నువ్వు చేసిన టమాటా పచ్చడి మన బేబీ అంత బాగుంది. చాలా బాగా చేశావు"

భర్త మాటలు వెనకటి లాగ తిండితిమ్మన్న మాటల్లా వినపడట్లేదు. అపురూపంగా వింటూ కళ్లు మూసుకుంది.

★

పాపల పీక నులిమే పవిత్ర భూమి

2011 జనాభా లెక్కల ప్రాథమిక వివరాలు ఈ సంవత్సరం మార్చిలో విడుదల కాగానే హాహాకారాలు చెలరేగాయి. ఆడబిడ్డల హంతకుల దేశమా మనది? అనే ప్రశ్నలు ఇంటర్‌నెట్‌లో నిండిపోయాయి. అందులో అనుమానమేం అక్కర్లేదని జనాభా లెక్కలు సూచిస్తున్నాయి. పాపాయిల పీక నులిమే పవిత్రభూమిగా ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి. ఎందుకో...ఏమిటో...

0-6 వయస్సు కలిగిన ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 2001లో 927 మంది అమ్మాయిలుంటే 2011 నాటికి ఆ సంఖ్య 914కి పడిపోయింది. అంటే ప్రతి వెయ్యి మందికీ 13 మంది అమ్మాయిలు మరింతగా తగ్గారన్న మాట. మన రాష్ట్రంలో ఆడపిల్లలు 961 నుండి 943కి తగ్గారు. అంటే 18 మంది తగ్గారు. మన రాష్ట్రంలో అమ్మాయిల తరుగుదల రేటు జాతీయస్థాయి కంటే 5 పాయింట్లు ఎక్కువగా ఉంది. ఒక్క పశ్చిమగోదావరి మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో అమ్మాయిల సంఖ్య తగ్గింది. సాధారణంగా ప్రతి 100 మంది అమ్మాయిల జననాలకు 105-6 మగపిల్లల జననాలు ఉంటాయి. దానికి కారణం సంవత్సరం లోపు లేదా 5సం॥రాల లోపు జరిగే సహజ శిశుమరణాల సంఖ్య అబ్బాయిల్లో చాలా ఎక్కువ. సహజసిద్ధంగా జరిగే గర్భస్రావాల్లో మగపిండాల గర్భస్రావాలే ఎక్కువ. ఎందుకంటే మగశిశువు బలహీనమైంది. కాబట్టి సమతుల్యత కాపాడటానికి మగశిశు జననాలు ఎక్కువ జరుగుతాయి. మగశిశు మరణాలు ఎక్కువ ఉండటంలో సమతుల్యం ఏర్పడుతుంది. ఇది ప్రకృతి ధర్మం. కాని వైద్య విజ్ఞానం పెరిగి శిశుమరణాలు తగ్గాయి. అబ్బాయిలు బతికే రేటు పెరిగింది. కాని అమ్మాయిల జననాలు తగ్గి 5 ఏళ్ళలోపు మరణాలు విపరీతంగా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ప్రతి వెయ్యి మంది మగ శిశువులకూ 950 మంది ఆడశిశువులు జన్మిస్తున్నారు. భారతదేశంలో 2006 (ఎన్ఎస్ఎస్) సర్వే ప్రకారం 882 మంది అమ్మాయిలే జన్మిస్తున్నారు. మనకు జననాల రిజిస్ట్రేషను చేయించడంలో వున్న అనేక లోపాల వల్ల ఈ సంఖ్య ఎంతవరకు నమ్మదగినదో చెప్పలేం. అందుకే 0-6 మధ్య వయస్సులో బాలబాలికల నిష్పత్తిని ప్రామాణికంగా తీసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ సగటు కంటే తక్కువ బాలికల సంఖ్య నమోదు చేసిన జిల్లా వరంగల్-912 (43 పాయింట్లు తగ్గింది). 11 జిల్లాలు రాష్ట్ర సగటు 943 కంటే తక్కువలో ఉన్నాయి. వీటిలో 6 జిల్లాలు తెలంగాణలో, 1 జిల్లా కోస్తాలో, 3 రాయలసీమలో ఉన్నాయి. 2001 కంటే తగ్గుదల రేటు నెమ్మదించిన జిల్లాలు 8. అన్నిటికంటే తగ్గుదల రేటును 17 పాయింట్లు తగ్గించినది హైద్రాబాద్. ఇక్కడ ఒక ఏడాదిపాటు పిసిపిఎన్‌డిటి చట్టం అమలు చేసి స్కాన్‌సెంటర్లపై దాడులు జరిపి 600 పైగా కేసులు నమోదు చేసి కొన్నింటి అనుమతులు రద్దుచేయగా వచ్చిన ఫలితమిది. పశ్చిమగోదావరిలో (2001లో) 14 పాయింట్లు తరుగుదల రేటు ఉంటే అది ఈసారి 0కి చేరింది. అయితే దీనికి కారణం గిరిజన ప్రాంతాల్లో అమ్మాయిల సంఖ్య కావచ్చు. గత పదేళ్ళలో కర్నూలు, అనంతపురం జిల్లాలో తరుగుదల రేటు 7 రెట్లు పెరగగా వరంగల్, కడప రెట్టింపు పెరిగాయి. విజయనగరం, విశాఖ, కృష్ణా జిల్లాల్లో కూడా తరుగుదల రేటు బాగా వేగం పెరిగింది. బాలికల నిష్పత్తి 10 పాయింట్లకంటే తగ్గిన ప్రతి జిల్లాలో/ ప్రతిప్రాంతంలో (పిసిపిఎన్‌డిటి) చట్టం అమలు కావటంలేదని స్పష్టంగా చెప్పవచ్చు. అట్లాగే కొన్ని జిల్లాల్లో స్కాన్ మిషన్ల సంఖ్య 146% శాతం పెరిగింది. ఈ స్కాన్ మిషన్లలో ఎక్కువభాగం మండల కేంద్రాలు లేదా నగర శివారు ప్రాంతాల్లోనే పనిచేస్తున్నాయి. వీటిని నడిపేవారు డాక్టర్లయి ఉండాలనేం లేదు. ప్రభుత్వమే స్వయం ఉపాధిలో భాగంగా స్కాన్ మిషన్లు పనిచేయించడంలో 15 రోజులపాటు శిక్షణ యిచ్చి వదులుతున్నది. నమోదైన స్కాన్ సెంటర్లు 30 వేలకు పైగా వున్నాయి. అంటే కనే వయస్సులో ఉన్న ప్రతి 28 వందల మంది వివాహితులకూ ఒక స్కాన్ సెంటరు వుంది. నమోదు కాని స్కాన్ సెంటర్ల సంఖ్య ఇంకా భారీగా ఉండే అవకాశం ఉంది. 75% స్కాన్ సెంటర్లను నడిపేది ఏ అర్హతా శిక్షణా లేని వాళ్ళే. వీటిలో ఏం జరిగిందో తెలియచేసే రికార్డులేవీ ఉండవు. హైద్రాబాద్ స్కాన్ సెంటర్లలో కేవలం 16 శాతం మాత్రమే రికార్డులు నడుపుతున్నాయి. కొన్ని ఆసుపత్రులకు లింగనిర్ధారక పరీక్షలే ప్రధాన ఆదాయ వనరుగా మారిపోయింది. ఏది ఏమైనా లింగ నిర్ధారణ, ఆ తర్వాత అబార్షన్లు విచ్చలవిడిగా జరిగిపోతున్నాయి.

మొత్తం భారతదేశంలో గత దశాబ్దంలో ఒక కోటిపైగా ఆడ పిండాలను కడుపులోనే చంపేశారని లాన్సెట్ (టొరాంటో విశ్వవిద్యాలయం) అధ్యయనం వెల్లడించింది. దానికి అనుగుణంగానే దాదాపు కోటి మంది బాలికలు తగ్గారు. పిసిపిఎన్‌డిటి చట్టాన్ని అమలు చేసే యంత్రాంగం అవసరం మేరకు లేకపోవటం ఒక భాగం అయితే...అధికార యంత్రాంగం అవినీతిలో కూరుకుపోవటమే అసలు చట్టం అమలు కాకపోవడానికి ప్రధాన కారణం. ఈ చట్టాన్ని అమలు చేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం లేదనే విషయం ప్రతిసారి తేటతెల్లమవుతోంది. పర్యవేక్షణా/సలహా మండలి ఏడాదికి ఒక్కసారి కూడా సమావేశం జరపకపోవడమే దీనికి నిదర్శనం. రాష్ట్ర, జిల్లా స్థాయిలో అసలు కమిటీలున్నాయో లేదో కూడా తెలియదు. ఒకవేళ ఉన్నా వాటిలో మహిళా సంఘాలు కాని స్వచ్ఛంద సంస్థలుకాని ప్రాతినిధ్యం పొందవు. ఇక ఏ ప్రధాన, ఏ రాజకీయపార్టీల ఎజెండాలోనూ వివక్ష-నిష్పత్తి అనేది మచ్చుకు కూడా కనబడదు. పసి బాలికలకు ఓట్లులేవు కదా? కనుక ఆడ పిండాల్ని నాశనం చేసి ఆడపిల్లలు పుట్టకుండా చేస్తున్న ఈ ఆధునిక ఆటవిక చర్య రాజకీయ పార్టీలకు "ఆడాళ్ళ గోల"గా కనబడటంలో ఆశ్చర్యం లేదు. అంతేకాదు. స్త్రీల రాజకీయ రిజర్వేషన్లు తిరస్కరించే మగాధిపత్యపు రాజకీయం ఈ విషయం పట్టించుకోకపోవటంలో ఆశ్చర్యం ఏముంది? లింగనిర్ధారక పరీక్షలు కోరుకుని చేయించుకుంటారు కాబట్టి పరీక్ష చేయించుకునే వారి వైపునుండి ఫిర్యాదులు రావు. లింగనిర్ధారణ జరపడంలో స్త్రీల నిర్ణయం ఉన్నా లేకున్నా వారిపై కేసులు పెడతారనే భయంతో స్త్రీలు ఫిర్యాదు చేయరు. కాబట్టి ఎటునుండి ఎటు చూసినా లింగనిర్ధారణలు ఆడపిండాల గర్భస్రావాలు నిరాటంకంగా సాగిపోతున్నాయి. అయితే ఈ మొత్తం వ్యవహారాన్ని కేవలం వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని లాభాల కోసం వాడుకునే అనైతిక ప్రవర్తనగా లేదా చట్ట వైఫల్యంగా మాత్రమే చూడకూడదు.

ఉత్తర భారతదేశంలో ఈ నాటికీ కొనసాగుతున్న భూస్వామ్య భావజాలం, బలమైన మత సాంప్రదాయాల పట్టు, కుల కట్టుబాట్లు, వీటిని కొనసాగించడంలో ఛాందస రాజకీయ పార్టీలకు జరిగే లాభం వంటివి మగపిల్లలకు ప్రాధాన్యత యిచ్చి పురుషాధిక్యతను కొనసాగిస్తున్నాయి. ఎన్ని కబుర్లు చెప్పినా కుటుంబంపై పెత్తనం మగాడిదే. ఈ ఆధిపత్యం సమాజంలో, ఆర్థిక రాజకీయ చట్టపరమైన అంశాల నిర్ధారణల్లో ప్రకటితం అవుతున్నది. చట్టాల అమలును తృణీకరిస్తున్నది.

దేశవ్యాప్తంగా ఆడపిల్లల పట్ల వివక్ష మగపిల్లలపై ఆపేక్ష పెరుగుతున్నది. మత సాంప్రదాయాలను పునరుజ్జీవింపచేయటం, కుల పంచాయితీల పునరుద్ధరణ అనేవి వరకట్నం, సతీసహగమన గొప్పదనం, కోడళ్ళను అదుపుచేయటం, పెద్దలు కుదిర్చే పెళ్ళిళ్ళు, కులగౌరవం వంటి వాటిని తిరిగి

రుద్దుతున్నాయి. సామాజిక చట్టంపై ప్రధాన మతాలు, పురుషాధిక్యతను రుద్దడం ద్వారా లింగవివక్షను కొనసాగిస్తున్నాయి. మరి దక్షిణ భారతంలో అందునా ఆధునికతలో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా బాలికల సంఖ్య విపరీతమైన వేగంతో తగ్గడానికి కారణం ఏమిటి?

మన సామాజిక నిర్మాణంలో అంతర్భాగంగా ఉన్న పురుషాధిక్య భావజాలం స్త్రీలకు అనివార్యంగా కొంత వెసులుబాటు కల్పిస్తున్నట్లు కన్పించినప్పటికీ సాంప్రదాయం, సంస్కృతి, మతం ఈ పెత్తనాన్ని పునరుద్ఘాటిస్తున్నాయి. ఆడపిండాల అబార్షన్లు, పసికూనల హత్యలు అనేవి కేవలం ఒక సూచన మాత్రమే. మొత్తంగా బాలికలపై సాగే వివక్షాపూరిత వ్యవహారంలో ఇది ఆవగింజలో అరవయ్యవ వంతే. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ స్త్రీలపై జరిగే అణచివేతలోనూ స్త్రీల శరీరాన్ని ప్రపంచ మార్కెట్‌లో వినిమయ సరుకుగా చేసి అమ్ముతున్న దమనకాండలో ఇది అనివార్య భాగం. కనుకనే అత్యంత దరిద్రంలో ఉన్న అనంతపురం, మహబూబ్‌నగర్, విజయనగరం, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో బాలికల నిష్పత్తి వేగంగా తగ్గగా ఈ మధ్య కాలంలో ఆదాయం పెరుగుదల విపరీతంగా వున్న వరంగల్, కడప, కర్నూలు, విశాఖ జిల్లాల్లో బాలికల నిష్పత్తి తీవ్రంగా పడిపోయింది. నగరాల కంటే గ్రామాలు, గ్రామాలకంటే గిరిజన ప్రాంతాల్లో బాలికలు నిష్పత్తి మెరుగ్గా ఉంది. ఉన్నతాదాయ వర్గాలు నివశించే నగరప్రాంతాల్లో ప్రతి నల్గురు మగపిల్లలకు ముగ్గురు మాత్రమే ఆడపిల్లలున్నారు. విద్యావంతులు, నికర ఆదాయం గల మధ్య తరగతి వారు నివశించే అపార్టుమెంట్లు/కాలనీలలో బాలికల సంఖ్య మురికివాడలు/బస్తీల కంటే 20 శాతం తక్కువగా ఉంది. ఇంకో మాటలో చెప్పాలంటే అభివృద్ధి చెందని ప్రాంతాల్లో వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో ఆడపిల్లలు బతికే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్న మాట.

పురుషాధిక్యత బలంగా ఉన్న మైదాన ప్రాంత గిరిజనుల్లో ఆడ నవజాత శిశు హత్యలు వెలుగులోకి వచ్చాయి. కానీ కొండప్రాంత గిరిజనుల్లో ఇప్పటికీ శ్రమ అవసరం, వారి సాంప్రదాయల వలన బాలికల నిష్పత్తి బాగుంది. దళితుల్లో, ఎవరికయితే లింగనిర్ధారణలకూ, గర్భస్రావాలకూ ఖర్చు చేసే శక్తి లేదో, ఎవరికైతే ఆ సాంకేతిక నైపుణ్యం అందుబాటులో లేదో వారిలో భ్రూణహత్యలు తక్కువే. అంటే దానర్ధం వారిలో బాలబాలికల పట్ల వివక్ష లేదనీ మగ సంతతి ప్రాధాన్యత లేదనీ కాదు. కనుకనే అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనూ వెనుకబడిన ప్రాంతాలకూ, పట్టణాలకూ, గ్రామాలకూ గిరిజన గిరిజనేతరులకూ సగటు నిష్పత్తి చేయకూడదు. దేనికది విడదీసి చూడాలి. తలసరి ఆదాయం 30 నుండి 60 శాతానికి పెరిగిన తెలంగాణలో 77% పెరిగిన హైద్రాబాద్ సహ ఏడు జిల్లాలలో ఆడపిల్లల శాతం తీవ్రంగా తగ్గింది. ఈ ప్రాంతంలో వెనుకబడిన తరగతుల ఆదాయం స్థిరంగా పెరిగింది. వేగంగా ఆస్తులు కూడగట్టుకుంటూ కొత్తగా వ్యాపార రంగంలోకి వ్యవసాయ రంగంలో వాణిజ్య పంటలకూ వెళు తున్న కులాలలో విద్య పట్ల ఆసక్తి పెరిగింది. అదే సమయంలో వీరిలో ఆడపిల్లల సంఖ్య బాగా తగ్గుతున్నది. గతంలో లేని స్కాన్ అందుబాటులోకి రావడంతో వీరితోపాటు కనీస ఆదాయం గలవారు కూడా లింగనిర్ధారణలకు తెగబడుతున్నారు. కుల పంచాయితీలు, పండుగలు, వేడుకల సందర్భంలో డబ్బు వెదజల్లే ఆర్భాటాలను పోషిస్తున్నది కూడా ఈ సామాజిక తరగతులేనని గమనించాలి. అట్లాగే ఆర్థికంగా ఎదుగుతున్న సామాజిక వర్గాలలో కుటుంబ నియంత్రణ కూడా ముగ్గురు నుండి ఇద్దరికి పడిపోయింది. అన్ని కులాలలో ఇది ఒకటికి చేరుతున్నది. ఇద్దరయితే ఒక ఆడ ఒక మగ. ఇక ఒక్కరయితే తప్పనిసరిగా వంశోద్ధారకుడే. కాబట్టి విద్యావంతులు, ఆస్తిపరులు, అగ్ర వర్ణాలవారు కూడా అయితే వారికి భవిష్యత్తులో మగపిల్లలే వుంటారన్నమాట. లింగనిర్ధారణలు నేరం అని నిర్ధారించాక వారు మరింత ఆధునికతవైపు పయనిస్తున్నారు. ఉన్నత తరగతుల వారు సంతాన సాఫల్య కేంద్రాలకు (ఫెర్టిలిటీ క్లినిక్స్) వెళ్ళి అక్కడ వీర్యకణాలను వడపోయించి బాలికలకు జన్మనిచ్చే X క్రోమోజోములు గల వీర్యకణాలను తొలగించి Y క్రోమోజోములు గల వీర్యకణాలను మాత్రమే స్త్రీ గర్భాశయంలో ప్రవేశపెడుతున్నారు. నవజాత శిశు వు హత్య క్రూరం, గర్భస్రావం నేరం. బాధాకరం. అసలు పిండంగా మారడానికి ముందే ఆడ క్రోమోజోము నిర్మూలన ఏ రొచ్చూ లేని పని. లక్షన్నర రూపాయలు ఖర్చు చేస్తే చాలు. సుఖంగా మగ బిడ్డను కనొచ్చు! లేని వాళ్లెటూ అమ్మాయిలను కంటారు. అమ్మాయిలను మనకంటే పైఅంతస్తు వాళ్ళకిచ్చే పాత సాంప్రదాయం ఎటూ ఉన్నది. కాబట్టి కింది నుండి కోడళ్ళను తెచ్చుకుంటే చాలు.

గతంలో ఆస్తి బయటకు పోకుండా మేనరికాలు జరిగేవి. ఇప్పుడు గ్రామీణ భారతంలో బాగా చిన్న చిన్న భూకమతాలు ఏర్పడ్డాయి. 85 శాతం కుటుంబాలు 5 ఎకరాలలోపే భూమి కలిగివున్నాయి. కాబట్టి ఆ భూమిని పంచడానికి లేదు. దీనికి కలపాలంటే కట్నం కావాలి. వారసత్వం, భూమి కొనసాగింపు కలసి నడుస్తున్నాయి. కాబట్టి భూమిగల మధ్య తరగతి కుటుంబాలు ఆడపిల్లలను తిరస్కరిస్తున్నాయి. అంతేకాదు 2005 స్త్రీలకు సమాన ఆస్తిహక్కు చట్టం రావడంతో అమ్మాయిలు భూమిలో వాటా తీసుకుని 'కుటుంబాలకు', 'బయటకు' దాటిస్తారనే భయం కూడా ఏర్పడింది. అట్లాగే వ్యాపార వర్గాలలో వరకట్నం భారీగా ఉంది. కాబట్టి కట్నం యివ్వకుండా ఉండటం, కట్నం ద్వారా సొమ్ము పోగేసుకోవటం జరగాలంటే అమ్మాయిలు పుట్టకూడదు. అబ్బాయిలను బాగా చదివించి వ్యాపారంలో మరింతగా పెరిగి మరింత సొమ్ము కూడగట్టాలి. ఆర్థిక భారంగా తయారయ్యే అమ్మాయి పుట్టి, పెరిగి పెళ్ళి చేసేవరకు కట్నం సొమ్ము కూడగట్టాల్సిన స్థితి ఉంటే అమ్మాయిలు వద్దనుకోవటంలో ఆశ్చర్యం ఏముంది? పైగా ఇప్పుడు ప్రపంచీకరణ పుణ్యమా అని అన్నీ సాంకేతికంగా సజావుగా జరిగిపోతాయి. దీనికి సామాజిక ఆమోదం పెరిగింది. గతంలో వుండే కనీస పాపభీతి ఇప్పుడు లేదు. పైగా గర్భస్రావం స్త్రీల హక్కుగా ప్రచారం జరుగుతోంది. స్త్రీల గర్భం మీద వారికేమయినా హక్కులున్నాయా? నిర్ణయం ఎవరు తీసుకుంటున్నారు? అనే దానితో నిమిత్తం లేదు. అనేక సందర్భాల్లో పురుషాధిక్యతను సహజసిద్ధమైందిగా ఆమోదించేస్తున్న ఆడవాళ్ళు కూడా గర్భస్రావాలకు ఎగబడటం కాదనలేని వాస్తవం. మగపిల్లవాడు వృద్ధాప్యంలో బీమా అనేకాదు తలకొరివి పెట్టాలనే మూఢనమ్మకం ఆడ మగ అందరికీ నరనరాన జీర్ణించుకుపోయింది. కాబట్టి సాంకేతిక పరిజ్ఞానం పర్యవసానాలతో నిమిత్తం లేకుండా లాభాల వేటలో స్వేచ్ఛను కోరుకుంటే స్త్రీల హక్కుల ముసుగులో 'మగ' ప్రాధాన్యత అమ్మాయిలను బలి చేస్తున్నది. పైగా ఇప్పుడు ప్రపంచీకరణ ఫలితంగా విద్యావైద్యం ఇతర పౌర సదుపాయాలన్నీ 'ప్రైవేటు సేవల' కోవలోకి చేరినాయి. దాంతో దరిద్రానికి నిస్సహాయత తోడైంది. వలసలు విపరీతంగా పెరిగాయి. ఆదాయం తగ్గిపోయింది. రోజుకి సగలు ఆదాయం 20 రూపాయలు కూడా లేని స్త్రీకి విలువ ఏముంది? ఉపాధి అవకాశాలూ బాగా తగ్గాయి. హింస పెరిగింది. ఫలితంగా వలసలు భారీగా జరిగే జిల్లాల్లో మహబూబ్‌నగర్, అనంతపురం, శ్రీకాకుళం బాలికల రక్షణ వలస కుటుంబాలకు పెద్ద సమస్యగా మారింది. కాబట్టి వలస పోయే కుటుంబాలు ఆడపిల్లల వద్దనుకుంటున్నాయి. ఒక రెండునెల్ల ఆదాయం ఖర్చు చేసైనా ఆడపిండాలను వదిలించుకుంటున్నాయి. ఇదొక సామాజిక వినాశనం.

జాతీయ మహిళా కమిషన్, మీడియా కూడా హింస అంటే అత్యాచారాలు, లైంగిక వేధింపులు, వరకట్న మరణాలు. భ్రూణహత్యలు, ఐదేళ్ళలోపు బాలికలకు తిండి పెట్టకుండా, వైద్యం చేయించకుండా మాడ్చి చంపే క్రూరత్వం పట్ల అవి దృష్టి సారించడంలేదు. లింగనిర్ధారణ గర్భస్రావాలు నివారించే చట్టం అమలు ఒక్కటే సరిపోదు. బాలికల పట్ల వివక్ష, నిర్లక్ష్యం, నిరాదరణ ఒక హింసారూపంగా గుర్తించాలి. ఎందుకంటే అది వారి చావుకు కారణం అవుతున్నది. స్త్రీలపై హింస ఒక అసమాన సామాజిక సంబంధాల ఫలితంగా పరిగణించి, అన్ని చట్టాలనూ పున: పరిశీలించాలి. సమానత్వంపై భారీ ఎత్తున చైతన్యం తేవాలి. జాతీయ రాజకీయ ఎజెండాలో బాలికల నిష్పత్తి-స్త్రీలపై జరిగే హింసను ఒక ప్రాధాన్యతాంశంగా చేయాలి. ఎందుకంటే బాలికల సంఖ్య ప్రమాద సూచికను దాటుతున్నది.

- దేవి



ఆ సినిమా వచ్చి ఇప్పటికి సరిగ్గా నాలుగు దశాబ్దాలైంది. విడుదలైన రోజుల నుంచి ఇవాళ్టి వరకు దాని గురించి గొప్పగా చెప్పుకుంటూనే ఉన్నారు. తెలుగు చలనచిత్ర లోకానికి కౌబాయ్ కథలను పరిచయం చేసి, సంచలనం రేపిన ఆ చిత్రం - 'మోసగాళ్ళకు మోసగాడు'. ఆ రోజుల్లో "ఏ తెలుగు నిర్మాతా సాహసించని రోకస్థలో, విశేష వ్యయ ప్రయాసలతో నిర్మించిన అపూర్వ చిత్రం"గా ఓ విశిష్ట స్థాయిని అందుకున్న ఈ "తొలి తెలుగు కౌబాయ్ చిత్రం" విడుదలై, ఈ ఆగస్టు 27 నాటికి సరిగ్గా నలభై ఏళ్ళయింది. తెలుగు తెరపై హాలీవుడ్ పోకడలకు తెర తీసి, ఒక తరం ప్రేక్షకులను ఉర్రూతలూగించి, వివిధ భాషల్లోకి అనువాదమైన ఈ సూపర్‌హిట్ చిత్రం జ్ఞాపకాల స్మారికి స్వాగతం...

తెలుగు తెరపై కౌబాయ్‌లకు కౌబాయ్

ఒకే రకమైన జానపదాలు, పౌరాణిక చిత్రాలతో జనానికి విసుగెత్తుతున్న కాలం అది. ఎన్టీఆర్, ఏయన్నార్‌లు తారలుగా స్థిరపడిపోయి చాలా కాలం అవడంతో, యువతరానికి చెందిన నవ తారలకు అవకాశాలు తెరుచుకున్న సమయం. కృష్ణ, శోభన్‌బాబు లాంటి నటులు ఆ అవకాశాలను అందుకోవాలని తపిస్తున్న తరుణం. ఆ పరిస్థితుల్లో ఇంగ్లీషు, హిందీ చిత్రాల స్ఫూర్తితో తెలుగు సినిమా సైతం క్రైమ్, యాక్షన్ తరహా చిత్రాల వైపు క్రమంగా మొగ్గింది. అలాంటి కొత్త కథల అన్వేషణలో తెలుగు మసాలాతో వండి, వడ్డించిన పాశ్చాత్య తరహా కౌబాయ్ వంటకం - 'మోసగాళ్ళకు మోసగాడు' (సంక్షిప్తంగా 'మో.మో').

కౌబాయ్ కథే ఎందుకు?

తెలుగు సినీ లోకానికి అప్పటికి కొత్తగా అనిపించే ఈ సాహస గాథను హీరో కృష్ణ అసలు ఎందుకు ఎంచుకున్నారు? దాని వెనుక కూడా నాటకీయత, సాహసం ఉన్నాయి. 1960ల ద్వితీయార్ధంలో సినిమాల్లోకి వచ్చిన కృష్ణ వరుసగా సినిమాలు చేస్తూ, 1970 నాటికి 40కి పైగా సినిమాలు చేశారు. కానీ, నటుడి నుంచి తార స్థాయికి తనకు పదోన్నతి కల్పించే చిత్రాలు చేయలేకపోతున్నాననే అసంతృప్తి ఆయనలో కలిగింది. ఆ అసంతృప్తి నుంచే సొంత చిత్ర నిర్మాణ సంస్థ, సొంత సినిమాల నిర్మాణమనే ఆలోచనలకు బీజం పడింది. అనుకున్నదే తడవుగా పెద్దమ్మాయి పేరు మీద 'శ్రీపద్మాలయా మూవీస్' సంస్థను నెలకొల్పారు. ఆ పతాకంపై తొలి సొంత చిత్రంగా తానే హీరోగా 'అగ్ని పరీక్ష' (1970) నిర్మించారు. కానీ, అది ఫ్లాపైంది. హీరోగా కృష్ణ ఆశించిన ఫలితమూ దక్కలేదు. దాంతో, స్వీయ చిత్ర నిర్మాణ సంస్థలో పెద్ద హిట్ సాధించాలనీ, ఇటు నిర్మాతగా, అటు హీరోగా పేరు తెచ్చుకోవాలనీ సహజంగానే కృష్ణలో పట్టుదల పెరిగింది. అలాంటి విజయం సాధించాలంటే, ఓ కొత్త తరహా సినిమా తీయాలని భావించారు. సరైన కథ కోసం వెతుకులాట మొదలైంది. అదే సమయంలో 'మెకన్నాస్ గోల్డ్' లాంటి హాలీవుడ్ కౌబాయ్ చిత్రాలు మద్రాసులో సంచలనం రేపుతున్నాయి. కృష్ణ మనసులో తళుక్కున ఆలోచన మెరిసింది. అలాంటి కౌబాయ్ కథే తెలుగులో తీస్తే? అలా 'మెకన్నాస్ గోల్డ్', 'గుడ్, బ్యాడ్, అగ్లీ', 'ఫ్యూ డాలర్స్ మోర్' తదితర హాలీవుడ్ చిత్రాలను కలిపి, తెలుగులో కొత్త వంటకం తీయాలనే నిర్ణయానికి వచ్చారు. ఆ పాశ్చాత్య కథలు, సంఘటనలను పక్కాగా తెలుగు వాతావరణానికి తగ్గట్టు వండి, వడ్డించే బాధ్యతను రచయిత ఆరుద్రకు అప్పగించారు. అదిగో అలా తయారైన కథే - 'మోసగాళ్ళకు మోసగాడు'. ఊళ్ళూ, పేర్లూ మాత్రం తెలుగు వాతావరణానికి తగ్గట్లు మార్చి, పాత్రల రూపురేఖలు, వస్త్రాలంకరణ మాత్రం ఇంగ్లీషు కౌబాయ్ సినిమాల శైలిలోనే ఉండేలా చూశారు. ఇంగ్లీషు చిత్రాల స్ఫూర్తితోనే తెలుగులో స్క్రీన్‌ప్లే సిద్ధం చేసుకున్నారు. కృష్ణతో 'టక్కరి దొంగ - చక్కని చుక్క' (1969) తదితర చిత్రాలు రూపొందించిన కె.ఎస్.ఆర్. దాస్ రౌడీ రాణి' (1970) చిత్ర విజయంతో మంచి జోరు మీదున్నారు. దాంతో, యువకుడు దాస్‌ను ఈ యాక్షన్ చిత్రానికి డైరెక్టర్‌గా ఎంచుకున్నారు.

సాహస గాథకు సాహసోపేత చిత్రీకరణ

ఒక్క ముక్కలో చెప్పాలంటే, ప్రేమికులైన హీరో హీరోయిన్లు తమ తండ్రులను చంపినవారిపై ఎలా పగ సాధించుకున్నారనేది ఈ చిత్ర కథ. హంతకులెవరో కనిపెట్టి, వారిని వెంటాడి, వేటాడే ఈ క్రైమ్ ఫార్ములాకు అమూల్యమైన నిధి కోసం అన్వేషణ, దాన్ని శోధించి సాధించడం, ప్రజల పరం చేయడం ఆసక్తికరమైన పైపూత! ఎడారుల్లో ఒంటెల మీద ప్రయాణం, గుర్రాల మీద ఛేజింగులు, పేలే తుపాకులు, కాలే ఇళ్ళు, దుర్గమమైన ప్రాంతాల్లో ప్రయాణాలు, సరసాలు, సరదాలు, వినోదాలతో ఊపిరి సలపనివ్వని ఉత్కంఠతో, చకచకా సాగిపోయే కథా కథనం 'మో.మో'ను అప్పట్లో ప్రత్యేకంగా నిలిపాయి. ఈ సాహస గాథను సెల్యులాయిడ్‌పై చిత్రీకరించిన తీరు కూడా నిజంగా సాహస గాథే. అప్పట్లో హీరో కృష్ణ సినిమాలను మూడు, నాలుగు లక్షల బడ్జెట్‌లో తీసేవారు. కానీ ఈ చిత్రానికి అంతకు రెట్టింపు మొత్తాన్ని ఖర్చు చేశారు. "భారతదేశంలోనే తొలి కౌబాయ్ మా 'మోసగాళ్ళకు మోసగాడు'. ఆ సినిమాను సిమ్లా, రాజస్థాన్‌లోని బికనీర్, మద్రాసు, పాండిచ్చేరిలలో తీశాం. ఎడారి దృశ్యాలను రాజస్థాన్‌లోని కోటా అనే చోట చాలా శ్రమపడి చిత్రీకరించాం" అని కథానాయకుడు కృష్ణప్రసాద్ పాత్రను పోషించిన హీరో కృష్ణ చెప్పుకొచ్చారు. కథానాయిక రాధగా నటించిన విజయనిర్మల సైతం తన కెరీర్‌లో ఎంతో కష్టపడి నటించిన సినిమా 'మో.మో' అని చెప్పారు. "ఈ సినిమా కోసం హీరోయిన్‌గా ఎన్నడూ అలవాటు లేని ఫైట్లు, గుర్రపుస్వారీ చేయాల్సి వచ్చింది. ఈ సినిమా కోసం నేను, కృష్ణ గారు, నాగభూషణం గారు రోజూ మద్రాసులోని మెరీనా సముద్రతీరంలో గుర్రపు స్వారీ సాధన చేసేవాళ్ళం" అని విజయనిర్మల చెప్పారు.

"ఆ చిత్ర నిర్మాణం కోసం కృష్ణ ఎంతో శ్రమపడ్డారు. యూనిట్ సభ్యులందరినీ రైళ్ళలో ఢిల్లీకి తీసుకువెళ్ళి, అక్కడ గదులు బుక్ చేసి ఉంచి, అక్కడ నుంచి సిమ్లాకు తీసుకువెళ్ళారు" అని కృష్ణ కెరీర్ తొలి రోజుల నుంచి ఆయనతో సాన్నిహిత్యం ఉన్న సీనియర్ సినీ జర్నలిస్టు మోహన్ కుమార్ చెప్పారు. హీరో కృష్ణ నిర్మించిన చిత్రాలకు కొద్దికాలం పాటు నిర్మాణ వ్యవహారాలను పర్యవేక్షించిన అనుభవం కూడా ఆయనకు ఉంది. సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, జ్యోతిలక్ష్మి తదితర ప్రముఖ నటీనటులెందరో ఈ చిత్రంలో నటించారు. రాజస్థాన్‌లోని థార్ ఎడారిలో మనుషులు తిరగని, మంచినీళ్ళు కూడా దొరకని చోట ప్రాణాలకు తెగించి, ఈ చిత్ర షూటింగ్ చేశారు. బికనీర్ కోటలో, సట్లెజ్ నదీ తీరంలోని తట్టాపానీ ప్రాంతంలో చిత్రీకరణ జరిపారు. "మో.మో. ఓపెనింగ్ షాటే ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంటుంది. వి.ఎస్.ఆర్. స్వామి కెమేరా పనితనం తెలియాలంటే, 'మో.మో' చూడాల్సిందే!" అని ఆయన అన్నారు. విలన్లు ఎడారిలో వదిలేసి వెళ్ళినప్పుడు, తాగడానికి నీళ్ళయినా లేక ఎండలో మాడిపోయి హీరోకు ముఖమంతా పొక్కులు వచ్చినట్లు చూపించే సన్నివేశం ఈ చిత్రంలో ఉంది. సరైన మేకప్ సామగ్రి దొరకని సమయంలో కృష్ణ వ్యక్తిగత మేకప్‌మ్యాన్ సి. మాధవరావుకు చటుక్కున ఓ ఆలోచన వచ్చింది. దగ్గరలోనే బఠాణీలు దొరికితే

తెప్పించారు. ఆ బరాణీల పైన పొరలా ఉండే, తొక్కు తీయించారు. ఆ తొక్కులను హీరో కృష్ణ ముఖంపై అంటించారు. అంతే! సన్నివేశానికి కావాల్సిన ముఖంపై పొక్కుల ఎఫెక్ట్ వచ్చింది. సాంకేతిక నిపుణులు చూపిన అలాంటి సమయస్ఫూర్తి, 'గుడ్, బ్యాడ్, అగ్లీ' చిత్రంలోని 'అగ్లీ' పాత్ర స్ఫూర్తితో మలచిన నక్కజిత్తుల నాగన్న (పాత్రధారి విలక్షణ నటుడు నాగభూషణం) పాత్రచిత్రణ, ఫైట్ మాస్టర్లు మాధవన్, రాఘవులు చేసిన సాహసాల లాంటివి ఇవాళ్టికీ ఓ పెద్ద గాథ.



డైరెక్టర్ కెఎస్ఆర్.దాస్, సినిమాటోగ్రాఫర్ విఎస్ఆర్.స్వామి

తప్పిన అంచనాలు! తప్పని గురి!!

అయితే, ఈ చిత్ర షూటింగ్ జరుగుతున్నప్పుడు నిరుత్సాహపరిచినవారూ లేకపోలేదు. ప్రముఖ నిర్మాత - దర్శకుడు, చిత్ర పరిశ్రమలో హీరో కృష్ణకు మొదటి నుంచీ శ్రేయోభిలాషీ అయిన చక్రపాణి ఒకసారి షూటింగ్ జరుగుతుండగా వచ్చారు. సెట్‌లోని కౌబాయ్ వాతావరణం, నటీనటుల గెటప్‌లు చూసి, ఆయన పెదవి విరిచారు. మన తెలుగు వాతావరణానికి దూరంగా ఉండే ఈ గెటప్పులనూ, సెటప్పులనూ సామాన్య ప్రేక్షక జనం మెచ్చరని తన అంచనా అడక్కుండానే చెప్పేశారు. కానీ, అప్పటికే సగానికి పైగా సినిమా షూటింగ్ అయిపోయింది. దాంతో, హీరో కృష్ణ బృందం ఆ అభిప్రాయాలను పక్కనపెట్టి, ముందుకు సాగారు. మొదట ఈ చిత్రానికి 'అదృష్ట రేఖ' అని పేరు పెడదామనుకున్నా, చివరకు 'మోసగాళ్ళకు మోసగాడు' అనే మాస్ టైటిల్‌నే ఎంచుకున్నారు. తీరా షూటింగ్ పూర్తయి, తొలి కాపీ వచ్చాక కూడా ప్రివ్యూలు చూసినవారెవరూ, ఈ సినిమాపై సరైన అంచనా చెప్పలేకపోయారు. కానీ, హీరో ఎన్టీఆర్ మాత్రం 'బాగుంది బ్రదర్! నిజంగా విభిన్నమైన మాస్ సినిమా తీశారు. అయితే, ఈ సినిమాలో ఆడవాళ్ళకు నచ్చే అంశాలు మిస్సయ్యారు. కాబట్టి, వాళ్ళు పెద్దగా చూడరు. ఫస్ట్ రిలీజ్ కన్నా, రీ-రిలీజుల్లో మరింత డబ్బు వస్తుంది. సంచలనం రేపుతుంది' అన్నారు. సరిగ్గా ఆయన అన్నట్లే అయింది. 1971 ఆగస్టు 27 శుక్రవారం నాడు బెంగుళూరుతో సహా తెలుగు నాట సుమారు 27 కేంద్రాల్లో, "దాదాపు 35 ప్రింట్లతో 'మోసగాళ్ళకు మోసగాడు' విడుదలైంది. చివరకు, "ఎన్టీఆర్ చెప్పినట్లే అయింది. మహిళాదరణ దక్కలేదు కానీ, సినిమా సంచలనాత్మక విజయం సాధించింది" అని హీరో కృష్ణ అప్పటి సంగతులను గుర్తు చేసుకున్నారు.

సక్సెస్‌కు సహకరించిన అంశాలు

తెలుగులో అంతకు మునుపెన్నడూ రాని సాహస గాథా చిత్రమైన 'ఈ కొత్త తరహా సినిమా తెలుగు తెరకు శోభాయమానమైన అమూల్య కానుక' అని అధికశాతం మంది అభిప్రాయపడ్డారు. ఇంకా బ్లాక్ అండ్ వైట్ చిత్రాలే రాజ్యమేలుతున్న ఆ రోజుల్లో పూర్తిగా "ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించిన ఈ చిత్రంలో కథ కన్నా, కథా గమనం కన్నా కమనీయమైన దృశ్యాలు ప్రేక్షకులను విశేషంగా" ఆకర్షించాయి. "ఒక చక్కని ఆంగ్ల చిత్రం చూస్తున్నట్లు" అనిపించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది దర్శకుడు, ఛాయాగ్రహణ దర్శకుల చిత్రం. ఈ చిత్రానికి వన్నె తెచ్చింది, ప్రాణం పోసింది - ముఖ్యంగా వి.ఎస్.ఆర్. స్వామి సినిమాటోగ్రఫీ. అప్పుడప్పుడే వాడుకలోకి వస్తున్న రంగుల ఫిలిమ్‌ను ప్రకృతి రామణీయతను చూపేందుకు సద్వినియోగం చేసుకున్నారు. కెమేరా కోణాలను వి.ఎస్.ఆర్. స్వామి ఎంత వేగంగా మారుస్తూ వెళ్ళారో, సన్నివేశ పరంపరను కె.ఎస్.ఆర్. దాస్ అంతే వేగంగా నడిపిస్తూ వెళ్ళారు. ఫలితంగా చిత్రంలోని లోటుపాట్లు చటుక్కున ఎవరికీ తట్టలేదు. ఈ చిత్రకథకు సందర్భశుద్ధి కల్పించడానికి ఆరుద్ర ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ, అవి లోపరహితం కాలేకపోయాయి. ఈ సినిమాలో చూపినట్లు చిత్ర కథ జరిగే కర్నూలు సబాలో ఎడారులుండవు. గుంటూరు సర్కార్‌లో మంచుకొండలూ ఉండవు. అయినా, ఆ ఊపులో ఈ అనౌచిత్యం గురించి ప్రేక్షకులు ఎవరూ ఆలోచించ లేదు. 'దర్శకుడు కె.ఎస్.ఆర్. దాస్ ఎన్నో ప్రయోగాలు చేశారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త కెమేరా కదలికలు వాడాలని ఆయన ప్రయత్నిస్తుంటారు. 'మోసగాళ్ళకు మోసగాడు'లో ప్రధానంగా 8 ఆకారంలో కనిపించే కెమేరా కదలిక ఆయన సృష్టించినదే!" అని కృష్ణ, ఈ వ్యాసకర్తకు వెల్లడించారు. ఇక, సంగీతం, ప్రధానంగా నేపథ్య సంగీతాన్ని చిత్ర వాతావరణానికి అనుకూలంగా, కొత్త తరహాలో ఉంటూ జనాన్ని బాగా హుషారు పరిచేలా ఆదినారాయణరావు సమకూర్చారు. 'కోరినది దరి చేరినది...' అనే యుగళగీతం ఆకట్టుకుంది. డైరెక్టర్, సినిమాటోగ్రాఫర్ల కృషి ఫలించడానికి కోటగిరి గోపాలరావు కూర్పు కూడా బాగా తోడ్పడింది. విచిత్రం ఏమిటంటే, అప్పటి దాకా నాయిక, ప్రధాన పాత్రలకే పరిమితమైన శాస్త్రీయ నర్తకి, నటి రాజసులోచనతో ఈ చిత్రంలో ఓ శృంగార నృత్యం చేయించడం! 'సిగ్గేలా మగాడికీ.. పగ్గాలా వయారికీ...' అనే ఆ పాటలో రాజసులోచన నృత్యం ఆనాటి ప్రమాణాల్లోనే ఆంగ్ల చిత్రాల స్థాయిని అందుకుంది.

సరికొత్త చరిత్రకు శ్రీకారం

హీరోగా కృష్ణకు 60వ సినిమాగా విడుదలైన 'మోసగాళ్ళకు మోసగాడు' చిత్రం విమర్శలు, లోపాలకు అతీతంగా విజయవంతమైంది. 'పద్మాలయా' పతాకానికి తొలి విజయం అందించడమే కాక, తొలి తెలుగు కౌబాయ్ సినిమాగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. కృష్ణ ఈ చిత్రంతో స్టార్‌గా పేరు తెచ్చుకున్నారు. అంతకు పదింతల పేరు నిర్మాతగా సంపాదించుకున్నారు. "కేవలం 7 లక్షల రూపాయల బడ్జెట్‌లో 28 రోజుల్లో ఆ చిత్రాన్ని నిర్మించాం. తొలి రిలీజ్‌లోనే దాదాపు రూ. 32 లక్షలు వసూలు చేసింది. స్టార్ ఇమేజ్ కోసం సొంత బ్యానర్‌ను పెట్టిన నా లక్ష్యం నెరవేరింది. వెరసి 'మోసగాళ్ళకు మోసగాడు' ఓ ట్రెండ్ సెట్టర్ అయింది" అని కృష్ణ అన్నారు. ఆ సినిమాతో కృష్ణ ఎంత బిజీ అయ్యారంటే, మరో 12 చిత్రాలు విడుదలయ్యాక కానీ, ఆయన మళ్ళీ సొంత సినిమాను ప్రారంభించలేనంత బిజీ! ఈ సక్సెస్‌ఫుల్ సినిమా సహజంగానే ఇతర భాషల్లోకి డబ్ అయింది. తమిళంలో 'మోసక్కారనుక్కు మోసక్కారన్'గా, హిందీలో 'గన్‌ఫైటర్ జానీ' పేరుతో, ఇంగ్లీషులో 'ది ట్రెజర్ హంట్'గా అనువాదమైంది. "తమిళంలో వంద రోజులాడింది. హిందీలో వంద రోజులు ఆడలేదు కానీ, బాగా వసూళ్ళు సాధించింది" అని కృష్ణ చెప్పారు. గమ్మత్తేమిటంటే, హాలీవుడ్ చిత్రాల స్ఫూర్తితో అటు నుంచి ఇటు వచ్చిన ఈ చిత్ర కథ, మళ్ళీ ఇటు నుంచి అటు ఇంగ్లీషులోకి అనువాదమై, అక్కడి ప్రేక్షకుల్ని అలరించడం! "ఇంగ్లీషు డబ్బింగ్ రూపం గల్ఫ్ దేశాలు, సింగపూర్, కౌలాలంపూర్, టర్కీ, ఆఫ్రికన్ దేశాలన్నిటిలో కలిపి దాదాపు 80 దేశాల్లో విడుదలైంది" అని కృష్ణ తెలిపారు.

సినిమా విడుదలైన తొలి రోజుల్లో ప్రచారంలో పేర్కొన్నట్లుగానే ఈ చిత్రం "తెలుగు చలనచిత్ర చరిత్రలో నూతనాధ్యాయం ప్రారంభించిన చిత్రం"గా నిలిచింది. ఆ పైన మరెన్నో కౌబాయ్ చిత్రాలు తెలుగులో రావడానికీ, కృష్ణ కూడా మరిన్ని కౌబాయ్ వేషాలు వేయడానికీ తోడ్పడింది. 'మోసగాళ్ళకు మోసగాడే' ప్రేరణ. దాదాపు 15 కౌబాయ్ చిత్రాల్లో కృష్ణ నటించారు. అయితే, ఆ తదుపరి చిత్రాలేవీ తొలి విజయాన్ని మరిపించలేక పోయాయి. సాక్షాత్తూ కృష్ణకు నట వారసుడైన యువ హీరో మహేష్‌బాబుతో కూడా మళ్ళీ అదే రకమైన కథతో పదేళ్ళ క్రితం భారీ వ్యయంతో 'టక్కరి దొంగ' (2002) చిత్రం నిర్మితమైంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, హాలీవుడ్ కౌబాయ్‌ల అసలు సిసలు లొకేషన్లలో ఆ సినిమా తీశారు. హీరో కృష్ణ కూడా ఆ సినిమా శుభం కార్డు పడే సమయంలో ఒక్క క్షణం తెరపై మెరిశారు. కానీ, అవేవీ ఆ సినిమాకు విజయం అందించలేకపోయాయి. ఏమైనా, ఇవాళ్టికీ తెలుగులో కౌబాయ్ హీరో అంటే కృష్ణే! కౌబాయ్ సినిమా అంటే - 'మోసగాళ్ళకు మోసగాడే'!

- రెంటాల జూనియర్



ఎల్లోరా గుహలు

స్కూళ్లకి నాలుగు రోజులు సెలవులు వచ్చేసరికి ఎక్కడికైనా వెళ్దామనుకున్నాం. మా అమ్మాయి మామయ్య దగ్గరికి వెళ్దామంది. సరేనని మా తమ్ముడికి (తను పూనాలో ఉంటాడు) వస్తున్నామని చెప్పాం. తను అందరం కలిసి అజంతా, ఎల్లోరా గుహలకు వెళ్దామంటే ఓకే చెప్పాం.

ఎల్లోరా గుహలున్న ఊరిపేరు వెరూల్. చుట్టూ అడవి... పచ్చని చెట్లు... ఓ పే...ద్ద... కొండ. ఆ కొండ మధ్యలో అగ్గిపెట్టెల్లాంటి చిన్న చిన్న గుహలు... ఆ రోజు వాతావరణం కూడా మబ్బులు పట్టి చల్లగా, ఆహ్లాదకరంగా, వర్షం వచ్చేలా ఉంది.

గుహల దగ్గరికెళ్లగానే ఇద్దరు ముగ్గురు పరుగెత్తుకొచ్చి ఆరుగురికి (మేం వెళ్లింది ఆరుగురం) మూడొందలు ఇస్తే ఆటోలో తిప్పి మొత్తం గుహలు చూపిస్తామన్నారు.ఆటోలో వెళ్తే తనివితీరా చూడలేమని నడిచే చూద్దామనుకున్నాం

ఎల్లోరా గుహల్లో హిందూ, బౌద్ధ, జైన మతానికి చెందిన శిల్ప కళ కనిపిస్తుంది. ఈ గుహలన్నీ ఎక్కువ శాతం తొమ్మిది నుండి 11వ శతాబ్దానికి చెందినవి. 1 నుండి 12వ గుహ వరకు బౌద్ధమతానికి, 14 నుండి 29 వరకు హిందూమతానికి, 30 నుండి 34 వరకు ఉన్న గుహలు జైన మతానికి చెందినవి. అయితే వీటిలో కొన్ని గుహలను మొదలు పెట్టి సగంలో ఆపేశారు. వాటిలో రెండు మూడు శిల్పాలు మాత్రమే ఉన్నాయి. మరి కొన్ని గుహలనైతే తవ్వి వదిలేశారు.

ముందుగా ఎటునుండి చూడాలో అర్థం కాలేదు. సరేనని అలా నడుచుకుంటూ వెళ్తే 14వ నెంబరు గుహ అని ఓ గుహ ఎదురుగా రోడ్డుమీద రాసి ఉంది. అక్కడి నుండి 1వ గుహ వరకు వరుసగా వున్నాయి. అంటే మేం 14 నుండి 1 వరకు వెనక్కి చూశాం. 14వ గుహ బయటినుండి చూసి లోపలంతా చీకటిగా వుంటుందేమో అనుకున్నాం. అనుకున్నట్లుగానే లోపల చీకటిగానే ఉంది. అయితే మరీ అసలు కనిపించనంత చీకటి కాదు. అక్కడున్న శిల్పాలన్నీ చక్కగా కనిపిస్తున్నాయి. ఒక్కో శిల్పం 12 అడుగుల పైనే ఉంది. ఈ గుహ మధ్యలో ఉన్న గదిలో పెద్ద బుద్ధ విగ్రహం, దానికి ఎడమవైపు గోడ మొదటి ఫలకం మీద దుర్గాదేవి విగ్రహం, మూడవ ఫలకం మీద విష్ణుమూర్తి విగ్రహం ఉన్నాయి. ఇంకా లక్ష్మీదేవి, శివుడు, పార్వతీదేవి విగ్రహాలు కూడా ఉన్నాయి. బాబోయ్ కొండని తొలిచి ఇలా చెక్కడానికి ఎన్నేళ్లు పట్టిందో! ఇక్కడ మరో విషయమేంటంటే ఈ గుహలన్నీ కొండ వాలు తలాన్ని ఎన్నుకుని చెక్కారు.

ముఖ్యంగా చెప్పుకోవాల్సిన గుహలు 11, 12. వీటిని చూసి ఆహా... ఏమి పనితనం అని మెచ్చుకోకుండా ఉండలేం. ఎందుకంటే ఈ రెండు గుహలూ మూడు అంతస్తులుగా చెక్కారు. ఈ రెండింటిలోనూ 12వ గుహ ఇంకా పెద్దది. దీన్ని చూశాక ఇది నిజంగా కొండని తొలిచే చెక్కారా లేదా సిమెంటుతో కట్టారా అనిపించింది. దీన్ని 'తీన్ థల్' అని పిలుస్తారట. దీని ద్వారం సుమారు 15 మీటర్ల పైనే ఉంది. మొదటి అంతస్తు కొలత 35×13 మీటర్లు. పై రెండు అంతస్తులు కూడా అదే కొలతతో ఉన్నాయి. పైకెక్కడానికి మెట్లు చాలా పెద్దగా ఉన్నాయి. ఒక్కో మెట్టు ఎత్తు అడుగున్నర, రెండడుగుల వరకూ ఉంది. ఈ గుహలోని బుద్ధవిగ్రహం ప్రసన్న వదనంతో చేతులు జోడించి నమస్కరిస్తున్నట్లు ఉంది. చూసేకొద్దీ ఇంకా చూడాలనిపించేలా ఉందీ విగ్రహం. రెండో అంతస్తులో కాపీ పేస్ట్ చేసిన వాటిలా గుమ్మానికి అటు ఏడు, ఇటు ఏడు అందంగా చెక్కబడిన బుద్ధ విగ్రహాలున్నాయి. వీటిలో ప్రతి విగ్రహం పక్కన ధర్మచక్రం, తలపైన బోధివృక్షం, ఆయన్ని ఆశీర్వదిస్తున్నట్లు పైన గంధర్వులున్నారు. పక్కనున్న మరో గోడకి ఇంకో పెద్ద బుద్ధవిగ్రహం ఉంది. తలమీద రింగులు తిరిగిన జుట్టుతో సహ ఎంత బాగా చెక్కారో... ఇందులోని బుద్ధవిగ్రహానికి చిన్న చిన్న రిపేర్లు చేస్తున్నారు. అందుకే కాబోలు రెండు మూడు విద్యుత్‌దీపాలు పెట్టారు. ఈ గుహల్లో మరెక్కడా లైట్లు కనిపించలేదు. పైకి సాదాసీదాగా కనిపించినా గుహ లోపలకి వెళ్లి తిరిగి చూస్తుంటే దాని గొప్పదనం, శిల్పుల పనితనం, వారు పడిన కష్టం తెలుస్తుంది. ఆ రోజుల్లో విద్యుత్ దీపాలు లేకుండా గుడ్డి దీపాలు పెట్టుకుని ఆ చీకట్లోనే అంత పెద్ద కొండని తొలిచారంటే మాటలు కాదు. అంతేకాదు కొండపై నుండి వచ్చే వర్షపు నీళ్లు లోపల నిలవకుండా బయటికి పోడానికి తగిన ఏర్పాట్లు కూడా ఉన్నాయి.

10వ గుహ రెండతస్థులుగా నిర్మించారు. ఇందులో ఎక్కువగా నగిషీలు చెక్కబడ్డాయి. ఇవి రాతితో చెక్కిన వాటిలా వుండవు. పోతపోసిన అచ్చుల్లా ఉంటాయి. దీని లోపల పై కప్పు భాగమంతా అనేక ఆర్చీలు పక్కపక్కన పేర్చినట్లుంది. స్థంభాల పై భాగంలో అనేక మానవాకృతిలో శిల్పాలు చెక్కారు. ఈ గుహలోని బుద్ధుడి వెనుక బౌద్ధ స్థూపం కూడా ఉంది. ఈ గుహని విశ్వకర్మకి అంకితం చేశారట. బౌద్ధమతానికీ ఆయకీ ఎటువంటి సంబంధమూ లేకపోయినా ఆయనమీదున్న గౌరవంతో శిల్పులు ఈ పని చేశారు. 6వ గుహలో చాలా శిల్పాలున్నాయి. అందులో చెప్పుకోవాల్సింది హిందువులు చదువుల తల్లిగా కొలిచే సరస్వతీ దేవి విగ్రహం. ఈమెకి దేశంలో రెండు చోట్ల మాత్రమే గుళ్లున్నాయంటారు. అయితే ఇక్కడ మాత్రం శిల్పం ఉంది. చెప్పుకోదగ్గ గుహల్లో మరొకటి 5వ గుహ. ఇది క్రీస్తు శకం 7వ శతాబ్దం నాటిది. ఇది చాలా పెద్దది. 35 1/2 మీటర్ల పొడవు, 17 మీటర్ల వెడల్పు ఉంది. ఎక్కువ స్థంభాలున్నది కూడా ఇందులోనేనేమో. మొత్తం 24 స్థంభాలున్నాయి. దీన్ని అప్పట్లో సమావేశాలకు, భోజనశాలగా ఉపయోగించేవారట.

3వ గుహలో ఇరువైపులా సర్పాలతో, పద్మాసీనుడైన బుద్ధుడు కనిపించాడు. ఇది కూడా దాదాపుగా 5వ గుహను పోలి వుంది. 2వ గుహలో సింహాసనంపై కూర్చున్న బుద్ధుడున్నాడు. ఇది బుద్ధుని రాజరికానికి గుర్తుగా చెక్కారేమో అనిపించింది. అయితే ఇందులో బుద్ధుని శిష్యబృందం కూడా కనిపిస్తుంది. ఇక 1వ గుహ ఎల్లోరాలోని అన్నింటికంటే అతి పురాతనమైనది. 6, 7 గుహల వద్ద చిన్న జలపాతం ఉంది. వర్షపు నీరు ఆ గుహల అంచుపై నుండి లోయలోకి పడుతుందేమో అనుకున్నాం. కాదని అక్కడి వాచ్‌మెన్ చెప్పాడు. ఎన్నో ఏళ్లనుండి అలా పడుతూనే ఉందట. చిరు జల్లులతో చాలా బావుంది.

ఇక అక్కడ్నుండి బ్యాక్ టు పెవిలియన్ అని మొదలుపెట్టిన 14వ గుహ దగ్గరికి వచ్చాం. దాని పక్కనే 15వ గుహ ఉంది. అప్పుడే వర్షం మొదలైంది. అలా వర్షంలోనే తడుస్తూ, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ 15వ గుహ చూశాం. దీని లోపలికి వెళ్లాలంటే చాలా మెట్లెక్కాలి. దీన్ని దశావతార టెంపుల్ అంటారు. ఇది

క్రీస్తుశకం 5,7 శతాబ్దాల మధ్యకాలం నాటిది (758-556 ఎ.డి). దీనికెదురుగా ఓ మండపం ఉంది. ఇది ఆనాటి నాట్యమండపమట. ఈ గుహ కూడా రెండంతస్తులు ఉంది. పై భాగంలో నాలుగు చిన్న చిన్న గదులున్నాయి. గోడలమీద శివుడికి సంబంధించిన అనేక అవతారాలున్నాయి. ఎనిమిది చేతులతో రాక్షస సంహారం చేస్తున్న శివుడు, శివతాండవం చేస్తూ, పార్వతితో కలిసి పాచికలు ఆడుతున్నట్లు... ఇలా అనేక రకాల భంగిమలున్నాయి. గర్భగుడిలాంటి గదిలో పెద్ద లింగాకారం, దానికెదురుగా నంది ఉన్నాయి. ఇక్కడున్నవన్నీ కొండనుండి తొలిచినట్లు కనిపిస్తాయి. కానీ ఈ నంది మాత్రం తెచ్చిపెట్టినట్లనిపించింది. ఇందులోని స్థంభాలు ఒక్కోటి మీటరు వైశాల్యంతో చాలా పెద్దగా ఉన్నాయి. మెట్లు కూడా అంతే, ఒక్కోటి రెండడుగుల ఎత్తు ఉంది. వీటిని ఎక్కడం లాగే దిగడమూ కష్టమే. ఈ స్థంబాలకి గతంలో తోరణాలు కట్టారేమో(?)! ప్రతి దానికీ నాలుగు వైపులా చిన్న చిన్న రంధ్రాలున్నాయి.

16వ గుహ అన్నింటికంటే ప్రధానమైనది, ముఖ్యమైనది కూడా. ఆ విషయం దీన్ని చూసింతర్వాత గానీ తెలీలేదు. దీనికెదురుగా ఉన్న స్థలాన్ని పార్క్‌లాగా చేశారు. అక్కడ కూర్చుంటే మనసుకు హాయిగా, అప్పటి వరకు ఉన్న అలసట మొత్తం పోయింది. ఇక లోపలికెళ్లి చూస్తే... వావ్... అనకుండా ఉండలేరు. కళ్లు తిప్పుకోలేనంత అందంగా ఉందా గుహ. దీన్ని తలపెట్టిన వారిని మెచ్చుకోకుండా, అభినందించకుండా ఉండలేం. అన్నట్టు దీనికి సెక్యూరిటీ కూడా ఉందండోయ్. దీన్ని గుహ అని కూడా అనకూడదేమో! ఎందుకంటే చూడ్డానికి అదో గుడి గోపురంలా ఉంది. ముదురు సిమెంటు రంగులో (అదో రకం నలుపు రంగు) ఉన్న కొండని తొలిచిన గుహ అది. ఓ ఆరేడంతస్థుల కంటే ఎత్తుగా ఉంటుందేమో ఆ కొండ. అమ్మో అంత కొండని తొలిచి ఇంత బాగా చెక్కడానికి ఎన్నేళ్లు పట్టిందో అనిపించింది. నిజంగానే దీని చెక్కడానికి ఏళ్లు కాదు, శతాబ్దాలే పట్టింది. 200 సంవత్సరాలపాటు, 10 తరాల వాళ్లు దీని నిర్మాణంలో పాల్గొన్నారట. దీన్ని కైలాస గుహ అంటారు. లోపలకి అడుగు పెట్టగానే రెండు గజరాజులు స్వాగతం పలుకుతాయి. అయితే అందులో ఒకటి బాగానే ఉంది కానీ, రెండో దానికి తొండం లేదు. చాలా వరకు పాడైపోయింది. గజరాజుల పక్కన రెండు పెద్ద ధ్వజస్థంభాలున్నాయి. వీటి మధ్యలో రెండంతస్తుల నిర్మాణం, దాని వెనుక గుడి గోపురం ఉన్నాయి. కింది నుండి తల పైకెత్తి చూస్తే ఆ కొండ ఆకాశాన్ని తాకుతుందా అనిపిస్తుంది. ఓహ్...! దీని గురించి ఎంత చెప్పినా తక్కువే. చూడాల్సిందే గానీ చెప్పడానికి మాటలు చాలవు.

చరిత్రలోకెళ్తే... దీని నిర్మాణాన్ని రాష్ట్రకూట వంశానికి చెందిన దంతి దుర్గ అనే రాజు 8వ శతాబ్దంలో మొదలెట్టాడు. కానీ ఆయన కాలంలో ఎక్కువ పని జరగలేదు. 9-11 శతాబ్దాల మధ్య ప్రాంతంలో దీనికి మెరుగులు దిద్దారు. కృష్ణ - 1 అనే రాజు ప్రత్యేక శ్రద్ధ పెట్టి దీని నిర్మాణం పూర్తి చేయించాడు. దీన్ని ప్రత్యేకంగా శివుడి కోసమే నిర్మించారట.

ముఖద్వారానికి ఎదురుగా ఉన్న మండపంలో లక్ష్మీదేవి విగ్రహం ఉంది. లోపలి భాగంలో గోపురం గోడల చుట్టూ ఏనుగుల శిల్పాలున్నాయి. అవే గోపురాన్ని మోస్తున్నాయా అనిపిస్తుంది. ఏనుగులు ఆనాటి రాజుల శక్తికి, గొప్పదనానికి గుర్తు. ఇంకా అనేక జంతువుల బొమ్మలు కూడా ఉన్నాయి. ఆ కాలంలో జంతువుల మీద ఎంత ప్రేమ చూపించేవారో, వాటిని ఎంత శ్రద్ధగా చూసేవారో తెలుసుకోడానికి ఇవి ఉపయోగపడతాయి. ఇందులో గంగ, యమున, సరస్వతి శిల్పాలున్నాయి. గంగ స్వచ్ఛతకు, యమున దైవత్వానికి, సరస్వతి విజ్ఞానానికి ప్రతీకలుగా వీటిని చెక్కారట. గోపురం ఉన్న భాగంలో ఇరువైపుల ఉన్న గోడలపై రామాయణ, మహా భారత గాథలకు చెందిన అనేక దృశ్యాలు చెక్కారు. ఈ ఆవరణలో ఓ మండపం కూడా ఉంది. దీన్ని రంగ్ మహల్ అంటారు. ఇందులో నాట్యం చేస్తున్న శివుడు, అన్నం పెట్టే అన్నపూర్ణ విగ్రహాలున్నాయి. ఈ గుహలోనుండి బయటికి రావడానికి అంత తొందరగా మనసొప్పదు. ఎంత సేపు చూసినా తనివి తీరదు. ఇందులో ఓ గ్యాలరీ కూడా ఉంది. అందులో కైలాసాన్ని వణికించే రావణుడి పురాణాన్ని తెలిపే గాథలు చెక్కారు.


12వ గుహ ముందరి భాగం

16 గుహకి ఎడమవైపున 15 నుండి 1వరకు వరుసగా ఉన్నాయి. కుడివైపు 17 నుండి 34వ గుహ వరకు ఉన్నాయి. 17, 20 గుహల్లో లింగాకారం, బ్రహ్మ, విష్ణువు, వినాయకుడు, మహిషాసురమర్ధిని శిల్పాలు ఉన్నాయి. ఇందులోని స్థంభాలకు కిందనుండే శిల్పాలు చెక్కారు. 21వ గుహ 7వ శతాబ్దానికి చెందింది. ఇందులోని స్థంభాలపై చక్కటి నగిషీలు చెక్కారు. దీని ముందుభాగం చాలా అందంగా ఉంది. ఇందులో మొసలి వాహనంపై గంగాదేవి విగ్రహం పెద్దగా, అందంగా ఉంది. ఇక్కడున్న నంది అన్ని గుహల్లో కంటే కొంచెం రిచ్‌గా, ప్రత్యేకంగా కనిపిస్తుంది. 25వ గుహ ఇక్కడున్న అన్నిటికంటే పెద్దది. ఇందులో ఏడు గుర్రాలతో ఉన్న రథంలో నిల్చున్న సూర్యుడు కనిపిస్తాడు. ఉష, ప్రత్యూష అనే ధనుస్సు, బాణాలను పట్టుకుని ఉంటుంది శిల్పం. 27వ గుహలో బలరామ, కృష్ణుల విగ్రహాలున్నాయి. ఈ గుహ తర్వాత ఓ చిన్న జలపాతం చాలా ఎత్తునుండి ప్రవహిస్తుంది. ఇది బాగా వర్షాలు పడినప్పుడు మాత్రమే ఉంటుందట.

29వ గుహ కూడా పెద్దదే. ఇందులో గదుల సమూహం ఉంది. అవి కొంచెం క్రాస్‌గా ఉంటాయి. ఇక్కడ హిందూ ఆలయాల్లోలాగా మెట్లకు రెండువైపులా సింహాలు కనిపిస్తాయి. అంటే మిగతా వాటికి కొంచెం భిన్నంగా ఉంటుంది గుహ. ఇందులో రౌద్ర రూపంలో ఉన్న శిల్పమొకటుంది (పేరు తెలీదు). మరో మండపంలో విలయ తాండవం చేస్తున్న నటరాజ విగ్రహం ఉంది. ముందు భాగంలో యమునానదికి మనిషి రూపమిచ్చి అందంగా మలిచారు. 30 గుహ 16వ గుహని పోలి ఉంది. దీన్ని ఛోటా కైలాస్ అంటారు. మొత్తం నగిషీలతో చెక్కబడి ఉంది. ఇందులో మహావీరుని శిల్పం, దాని చుట్టూ మరికొన్ని శిల్పాలున్నాయి. 31లో కూడా జైనుల విగ్రహాలే వున్నాయి. 32వ గుహ పేరు ఇంద్ర సభ. ఇది రెండంతస్తులతో ఉంది. ముఖద్వారం వద్ద పెద్దరాతి ఏనుగు స్థంభం, 12వ గుహలో ఉన్నట్లుగా పై కప్పుకి పద్మం, అందులో మహావీరుని విగ్రహం చెక్కబడి వుంది. ఒక జైన మతస్థుడు తీవ్రమైన తపోదీక్షలో ఉన్నట్లు మరో విగ్రహం ఉంది. పై అంతస్థులో నగిషీలు చెక్కిన స్థంభాలు, పెద్ద మండపం ఉన్నాయి. ఎల్లోరా గుహలన్నింటిలోని నగిషీల కంటే ఇక్కడివి ఆకర్షణీయంగా ఉన్నాయి. 34వ గుహకు అర్ధచంద్రాకారపు ఆర్చి గుండా వెళ్లాలి. ఇక్కడ కూడా 32వ గుహలో లాగే అందంగా చెక్కబడిన శిల్పాలు, స్థంభాలున్నాయి. జైన మతానికి చెందిన శిల్పకళ ఇక్కడ చాలా ఉంది.

సోమవారం ఎల్లోరా గుహలకి సెలవు. ఇందులోకి వెళ్లడానికి ఎంట్రన్స్ టిక్కెట్ 5 రూపాయలు. తినడానికి ఏమైనా తీసుకెళ్తే మంచిది. అన్నీ అక్కడ కొనుక్కుని తినాలన్నా కష్టమే.

ఈ గుహలన్నీ చూసిన తర్వాత మాత్రం ఓ మంచి అనుభూతికి లోనవుతారు (కానీ కాళ్లు నొప్పెడతాయనుకోండి. అది వేరే విషయం). ఇలాంటివి మళ్లీ మళ్లీ చూడలేం కాబట్టి హడావుడి పడకుండ కొంచెం తీరిగ్గా చూస్తేనే బాగుం.. చుట్టూ ఉన్న ప్రకృతి కూడా చాలా బావుంటుంది. కాకపోతే వీటిని చూడడంలో మునిగిపోయి దాని ప్రాముఖ్యత కాస్త తగ్గుతుంది అంతే. అయితే మాత్రం ప్రకృతిని పూర్తిగా వదిలేసినట్లు మాత్రం కాదు. గుహలపైకి ఎక్కి దిగేటప్పుడు అది మన కళ్లెదురుగానే ఉంటుందిగా. మధ్య మధ్యలో దాన్ని ఆస్వాదించొచ్చు. మనసుండాలే కానీ మార్గముండదా ఏంటి?!

- బి.మల్లేశ్వరి

అట్టమీది కథ

వినాయకత విలాసం పర్యావ'రణ'ం

వినాయకుడు, గణేశుడు, విఘ్నేశ్వరుడు, రకరకాల నామ ధేయాలతో దేశ ప్రజల పూజలందుకునే పార్వతీ తనయుడి ప్రత్యేకతలకు లెక్కలేదు. సంస్కృతంలో 'వి' అన్న ధాతువును రెండు రకాలుగా విశేషంగానూ వ్యతిరేకార్థంలోనూ వాడతారు. వి అంటే విశేషణం, విలక్షణం కూడా. మరో వైపున వి అంటే వ్యతిరేకార్థం కూడా ఇస్తుంది. చాలా మంది నాయకులను వినాయకులు ...డానికి కారణమదే. ఈ కలియుగ వినాయకుల ధాటికి అసలు వినాయకుడి జాతకం మారిపోవడం వినాయక చవితికి మనం బాగా చూడొచ్చు. మరే పండుగ కన్నా మిన్నగా మరే దేవుడి కన్నా మిక్కుటంగా వినాయక చవితి సందర్భంలోనే విశ్వాసాలూ రాజకీయాలూ పెనవేసుకుపోతాయి. విఘ్నాధిపతిగా కీర్తించబడే వినాయకుడి విగ్రహాలే పర్యావరణకు విఘ్నాలుగా తయారు కావడానికి కారకులు అభినవ వినాయకులే. షరా మామూలుగా ఈ సారి కూడా వినాయక విగ్రహాల తయారీలో పర్యావరణ కోణాన్ని గురించి వివిధ సంస్థలు నొక్కి చెబుతున్నప్పటికీ పరిస్థితి పెద్దగా మారుతుందనే ఆశ అంతగా లేదు. ఆ సంగతి రాబోయే రోజులకు వదిలేసి ప్రస్తుతం వినాయక విశేషార్ణవంలోకి వెళదామా...

వినాయకుడుకి వున్న మూడు పేర్లు కూడా అర్థవంతమైనవే. వినాయకుడు అంటేనే మంచి నాయకుడు అని. అలాగే గణేషుడు అంటే గణానికి నాయకుడు అని. ఒకప్పుడు ఆది మానవులు గణాలుగా జీవించే వారన్న సంగతి తెలిసిందే కదా. గణపతి, గణేశుడు అన్న మాటలు కూడా ఆ విధమైన అర్థాన్నే సూచిస్తాయి. గజాననుడు అంటే ఏనుగు ముఖం గల వినాయకుడు ఎలుక వాహనంపై వూరేగుతుంటాడు. ఆ రీత్యా ఆయన ఏనుగు ఎలుక గుర్తుగల గణాలకు నాయకుడు అన్న అర్థం కూడా వుంది. అతి పెద్దదైన ఏనుగును అతి చిన్నదైన ఎలుక రెండు వేర్వేరు గణాలకు చిహ్నాలనుకుంటే ఆ రెండు గణాలకు సయోధ్య చేసి నాయకుడైన వాడు అని కూడా అనుకోవచ్చు. శైవ మతంలో గణాపత్య అనే శాఖ వారు ఆయన ఆరాధనను ప్రధానంగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. గణ నాయకుడుగా చూసినా విఘ్న నాయకుడుగా చూసినా ఆయన పూజతో కార్యక్రమం మొదలు కావాలన్న భావం పాతుకు పోయింది. ఏ పని తలపెట్టినా ఏవో విఘ్నాలు, ఆటంకాలు కలుగుతుంటాయి గనక వాటికి నాయకుడైన విఘ్నేశ్వరుడిని పూజిస్తుంటారు. ఆ విధంగా వినాయక పూజతో ప్రతిపనికీ శ్రీకారం చుట్టడం సంప్రదాయంగా మారింది. వివాహ ఆహ్వాన పత్రికలపై ఒకప్పుడు ఎందరో దేవతలు వుంటే ఇప్పుడు వినాయకుడే అగుపించడానికి కూడా కారణమదే.వినాయకుడి బొమ్మను చిత్రకారులు రకరకాల రేఖా విన్యాసాలతో రూపొందించడం చూస్తుంటాము. వినాయకుడంటే విద్యా బుద్ధులకు కూడా అధిదేవతగా పూజలందుకుంటాడు. వినోదానికి కూడా ఆలవాలంగా అలరారుతుంటాడు గనకే ఈ పండుగ వచ్చిందంటే కార్టూనిస్టులు సరదాల పండగ చేసుకుంటారు.

మిగిలిన దేవతల్లా గాక గణేశ ప్రతిమలలో విపరీతమైన వైవిధ్యం కనిపిస్తుంది. నిల్చున్నట్టు, కూర్చున్నట్టు, నృత్యం చేస్తున్నట్టు, రాక్షసులను సంహరిస్తున్నట్టు, ఆడుకుంటున్నట్టు, ఇలా ఎన్నో రకాలుగా వుండటం పురాతన కాలం నుంచే గమనిస్తాం. మొత్తం ముప్పై మూడు రకాలుగా వినాయక ప్రతిమలున్నట్టు పరిశోధకులు చెబుతారు.

బహుశా ఈ వైవిధ్యం రానురాను మరింతగా విస్తరించింది. స్వాతంత్ర్య పోరాట కాలంలో బాల గంగాధర తిలక్ 1893లో గణేశ ఉత్సవాలు జరపడం ద్వారా దేశభక్తిని పెంపొందించేకు ప్రయత్నించాడు. మిగిలిన పండుగలకు లేని ప్రాచుర్యం వినాయక చవితికి



రావడానికి కారణమేమంటే ఆయన ప్రతివారికి అందుబాటులో వుంటాడన్న భావనే. బ్రాహ్మణ బ్రాహ్మణేతరులను ఏకం చేయడానికి గణేశ ఉత్సవాలు మంచి సందర్భాలని తిలక్ భావించాడు. అంతకు ముందు కాలంలో విగ్రహాలు ఇళ్లలో పెట్టుకునే హక్కు బ్రాహ్మణులకు మాత్రమే వుంటుందని పురాతన వర్ణ వ్యవస్థ సిద్ధాంతం. అందుకే ఇతరుల కోసం దేవాలయాలు కట్టించి భక్తి పద్ధతి పెంపొందించారు. ఆ దేవుడి గర్భగుడిలోకి కూడా ఇతరులు వెళ్లకూడదు గనక ఉత్సవాల సందర్భంలో వూరేగించి అందరూ పూజించుకోవడానికి వీలుగా ఉత్సవ విగ్రహాలను సృష్టించారు.ఈ నేపథ్యంలో వినాయకుడి విగ్రహాలను మాత్రం అందరూ ప్రతిష్టించుకుని పూజించే పద్ధతి బాగా ఆదరణ పొందింది.

ఇప్పటి సంగతి..

ఇప్పటికీ తిలక్ స్వరాష్ట్రమైన మహారాష్ట్రలో వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభోగంగా జరుగుతాయి గాని శివసేన ఆధ్వర్యంలో వాటి స్వభావం పూర్తిగా మారిపోయింది. గణపతి బప్ప మోరియా అంటూ నినాదాలు మార్మోగుతుంటే గణేశ ఉత్సవాలు రాజకీయ రంగు పులుముకున్నాయి. క్రమంగా ఇదే వరవడి హైదరాబాదుతో సహా దేశమంతటికీ పాకింది. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా ముగించడం పోలీసులకు పెద్ద సవాలుగా తయారైంది. ఈ క్రమంలో వినాయక విగ్రహాల తయారీ విధానం పర్యావరణానికి పెద్ద విఘ్నంగా మారిపోయింది.వినాయక చవితికి బాగా ముందే ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేయడం, భారీ వ్యయంతో పందిళ్లు వేసి పెద్ద పెద్ద విగ్రహాలను ప్రతిష్టించడం రివాజుగా మారింది. ఈ పందిళ్లు, విగ్రహాలు ఎంత భారీగా వుంటే అంత హంగామా అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఆగష్టు సెప్టెంబరు మాసాల మధ్య వినాయక చతుర్థి వస్తుంది. దాంతో వినాయక రాత్రులు మొదలవుతాయి.ఎర్రమట్టి లేదా బంకమట్టితో చేసిన విగ్రహాలను పూజ చేసి పదిరోజుల తర్వాత అనంత చతుర్థి రోజున నీటిలో దాన్ని నిమజ్జనం చేయడం సంప్రదాయం. విగ్రహాలను అలా నిమజ్జనం చేసే ముందు గణపతి బప్పా మోరియా అని పాడటానికి అర్థం వినాయకా మళ్లీ వచ్చే ఏడాదికి త్వరగా రా అని.

మామూలుగా అయితే వినాయక విగ్రహం పండుగకు రెండు మూడు రోజుల ముందు బంకమట్టితో తయారు చేయాలి. ఇంచుకన్నా చిన్న సైజుతో మొదలై 25 అడుగుల వరకూ దాన్ని పెంచేస్తారు. దాన్ని వేదికపై వుంచడాన్ని ప్రాణ ప్రతిష్ట అంటారు. తర్వాత చేసేవి షోడషోపచారాలు.(16 పూజా విధానాలు) బెల్లం, కొబ్బరితో పాటు 21 రకాల మోదకాలు, 21 రకాల పూలను సమర్పిస్తారు.ఇన్ని రోజుల పాటు భజనలు కీర్తనలు పూజా పురస్కారాలతో పరిసరాలు మార్మోగుతాయి.

ఇదంతా బాగానే వుంది గాని క్రమేణా వినాయక చవితి రూపం మారిపోయింది. మొదటి కారణం మత శక్తుల వ్యూహమైతే మరో కారణం ప్రతిదీ భారీ ఎత్తున చేయాలనే ధోరణులు పెరగడం. వినాయక చవితికి కొన్ని నెలల ముందుగానే ఉత్సవ కమిటీలంటూ ఏర్పాటు చేస్తారు. భక్తి భావంతో ఎవరికి వారు చేసుకోవలసిన పండుగను ఈ విధంగా తమ హస్త గతం చేసుకుని ఒక పెద్ద వలయం ఏర్పరుస్తారు. ఈ ఏడాది ఇన్ని పందిళ్లు వేయాలని కోటాలు వేసుకుని మరీ వేయిస్తారు. ప్రతివీధిలో కుర్రకారుతో సహా రకరకాల వారిని పోగుచేసి విరాళాల వసూలు మొదలు పెడతారు. మోతుబరులేమో పెద్ద ఖాతాలు వేయిస్తారు. ఇదిగాక వ్యాపార సంఘాల వంటివి కూడా తమ శక్తిని బట్టి భారీ వేడుకలకే సిద్ధమవుతాయి. అపార్ట్‌మెంట్ల సంస్కృతి ప్రబలిన రీత్యా ప్రతి చోటా తమ విగ్రహాన్ని తాము ఏర్పాటు చేసుకుంటారు. ఏతావాతా ఇవన్నీ కలసి వీధులన్ని విగ్రహాలమయమై ... తాయి.



సంఖ్య రీత్యా ఎక్కువ వుండటమే గాక విగ్రహాలను తయారు చేసే విధానం కూడా

ఖైరతాబాదు నుంచి గాజువాక వరకూ

రికార్డుల జ్వరం వినాయకుడికి కూడా తాకడంతో ఎంత పెద్దగా చేయాలనేదానిపై పోటీ పెరిగింది. రాష్ట్ర పాలనా కేంద్రమైన సచివాలయానికి వెనకనే ఖైరతాబాదు వినాయకుడు అలా అలా పెరిగి పెరిగి ఇప్పుడు అరవై అడుగుల వరకూ చేరాడు. ఈ ఉత్సవాలకు మూల పీఠమైన ముంబాయిలోనే 25 అడుగులు దాటడం అరుదని పరిశీలకులు చెబుతుంటే ఖైరతాబాద్‌లో ఈ సారి 55 అడుగుల మేరకు చేస్తున్నట్టు నమూనా విడుదల చేశారు. ఇందులో వేదిక భూగోళం ఆకారంలో 5 అడుగులు, ఎలుక పదిహేను అడుగులు అసలు విగ్రహం 30 అడుగులు సర్పం మరో అయిదు అడుగులు వుంటుందట. ఈ విగ్రహం చేతిలో పట్టుకునే లడ్డూ తాపేశ్వరం నుంచి ... భారీగా తయారై వస్తోందట! ఖైరతాబాద్ రికార్డును బద్దలు కొడుతూ ఇప్పుడు విశాఖ గాజువాక వినాయకుడు 108 అడుగుల ఎత్తున తయారవుతున్నాడు. దాని చేతిలో లడ్డు కూడా తాపేశ్వరం తయారీనే. వీటని నిర్మించడం, కూర్చడం, తరలించడం ఎంత వ్యయప్రయాసలతో కూడిందో వూహించుకోవచ్చు.



ఖరీదైన లడ్డూ

విగ్రహాల పరిమాణంతో పాటు వాటి చేతిలోని లడ్డూ ఖరీదు కూడా పెద్ద పోటీగా తయారైంది. ఖైరతాబాదు కన్నా బాలాపూర్ వినాయకుడి లడ్డూ ఎక్కువ రేటు పలికింది. గత ఏడాది దీనికి 5 లక్షల పైచిలుకు చెల్లించారు. గాజువాక కూడా ఇదే కోవలో చేరుతుంది. రియల్ ఎస్టేట్ బూమ్‌లో ఆ ధరలు చెల్లించడం పెద్ద పని అనిపించలేదు గాని దీనికి భక్తికి ఏం సంబంధం అని భక్తులు కూడా విస్తుపోతుంటారు.

సమస్యగా మారిపోతున్నది. బంకమట్టితో చేసినప్పుడు ఎంత పెద్దవైనా ఏ సమస్య వుండేది కాదు. కాని క్రమేణా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ఈ విగ్రహాలను చేస్తున్నారు. దాంతో అయితే భారీ ఎత్తున కోరిన విధంగా చేయొచ్చునంటారు.ఆ పైన ఆకర్షణ కోసం కృత్రిమమైన రంగులు వాడతారు. పండుగకు ఆరేడు మాసాల ముందునుంచే కళాకారులు అసంఖ్యాకంగా విగ్రహాలను చేయడం మొదలెడతారు. హైదరాబాదులో ధూల్‌పేటతో సహా వివిధ చోట్ల ఈ పని జరుగుతుంది.ఆ సమయంలో వెళ్లి చూస్తే అవన్నీ కార్ఖానాలుగా కనిపిస్తాయి.ఆ విగ్రహాలకు ధరలు కూడా కొన్ని వందల నుంచి వేలు పలుకు తాయి. వివిధ చోట్ల నుంచి వచ్చిన వారు వాటిని తీసుకుపోయి వేడుక మొదలు పెడతారు. ఆ సమయంలో హైదరాబాదు దారుల్లో ఎక్కడ చూసినా ఆటోల్లోనూ, డిసిఎంల్లోనూ విగ్రహాలు తీసుకుపోతున్న వారే కనిపిస్తారు. ఒక విధంగా ఇందులోనూ పోటీ. వీధుల మధ్యన కులాల వారీగా సంఘాల వారీగా కూడా వుంటుంది. చాలా చోట్ల దారులు మూసేసే విధంగా పందిళ్లు వేస్తారు. హైదరాబాదులో క్రమంగా పాతికేళ్లలో పాతుకు పోయిన ఈ సంస్కృతి ఇప్పుడు జిల్లాల్లోనూ కనిపిస్తుంది.

విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను వాడటం, కాలుష్య కారకాలైన కృత్రిమ రంగులను పెద్ద ఎత్తున వినియోగించడం అన్నిటికన్నా పెద్ద సమస్య. దీనివల్ల పర్యావరణం దెబ్బ తినడమే కాదు, వాటిని నగరంలోని కాలువల్లో చెరువుల్లో నిమజ్జనం చేసినపుడు ఆ నీరు కూడా కలుషితమై పోతుంది. ఇందుకు ప్రధానంగా గురయ్యేది ఇప్పటికే కాలుష్య కాసారంగా వున్న హుస్సేన్ సాగర్ చెరువు. ప్రతిఏటా పర్యావరణ ప్రియులు కాలుష్య నివారణ అధికారులు గగ్గోలు పెడుతున్నా ఉత్సవ నిర్వాహకులు గాని ప్రభుత్వాధినేతలు గాని పట్టించుకోవడం లేదు. పోటీలు పడి విగ్రహాలు చేయడంతో పాటు వాటన్నిటిని ఒకేసారి పెద్ద సంఖ్యలో తరలించడం వల్ల రాకపోకలు స్తంభించిపోవడంతో పాటు నగరంలో వాతావరణం కూడా ఉద్రిక్తంగా మారుతుంది.గత ఏడాది 43 వేలమంది పోలీసులను వినియోగించినా ఆఖరు వరకూ జనం బిక్కుబిక్కుమంటూనే గడిపారు. నిమజ్జనం రోజున నగరం దాదాపు స్తంభించిపోవలసిందే. అతి భారీగా వుండే ఖైరతాబాదు వినాయకుడు తెల్లవారుఝామున హుస్సేన్ సాగర్‌లో పడ్డాక గాని జనం వూపిరిపీల్చుకోరు. కొన్ని సార్లు ఈ ఉత్సవాలు ఉద్రిక్తతలకు కలహాలకు కూడా దారి తీశాయి.దీనిపై



అప్పటి పోలీసు అధికారి భాస్కరరావు సమర్పించిన నివేదిక గణేశ నిమజ్జనోత్సవాలను ఎలా నిర్వహించాలో కూడా సూచనలు చేసింది.అయినా అటు నిర్వాహకులు గాని ఇటు ప్రభుత్వాధినేతలు గాని వాటిని అమలు చేయరు.రాజకీయ లబ్ధి కోసం అరక్షిత విధానాలను అలాగే అనుమతిస్తుంటారు. విగ్రహాల సైజు ఇందులో ముఖ్యమైంది. వాటి పరిమాణం పెరిగిన కొద్ది మట్టితో చేసే ప్రసక్తి వుండదు.25 అడుగుల వరకూ మట్టితో చేయొచ్చని నిపుణులు చెబుతున్నా హంగామా, ఆకర్షణ కోరేవారికి సంతృప్తి లభించదు గనక కృత్రిమ పద్ధతులే పట్టుకుంటారు.ఈ క్రమంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగం తప్పనిసరిగా మారుతుంది. అలాగే సిమెంటు, కమ్మీలు కూడా వాడక తప్పదు. ఉపాధి కోసం దాంతో చేసే వాళ్లు ఏడాదిలో కొద్ది కాలం మినహా తక్కిన సమయమంతా వీటిని తయారు చేయడంలోనే నిమగ్నమవుతారు. బజార్లలోనూ వీధుల్లోనూ విగ్రహాలు పెట్టుకోవాలనుకునే వారు వాటిని తెచ్చుకోవడం సులభమని అనుకుంటారు. ఆ విధంగా కాలుష్యం వద్దంటూనే పెంచడం జరుగుతుంటుంది. పైగా హుస్సేన్ సాగర్ కలుషితం కావడానికి ఇదొక్కటే కారణమా అంటూ ఇదేదో మత పరమైన సమస్యగా చూపించే ప్రచారాలు చేస్తుంటారు కొందరు.

2006 లో రాష్ట్ర హైకోర్టు ఉత్సవాలకు ముందే పర్యావరణ కాలుష్యం జరగకుండా చూడాలని ఉత్తర్వులు జారీ చేయడంతో పెద్ద దుమారమే లేవదీశారు. జన విజ్ఞాన వేదిక వంటి

సంస్థలు రౌండ్ టేబుల్‌సమావేశాలు జరిపి అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తే వారిపై ధ్వజమెత్తారు. ఇదేదో హేతువాదులు, కమ్యూనిస్టులు మత వ్యతిరేకులు చేస్తున్న పని అన్నట్టు చిత్రించారే తప్ప నిజంగా జరుగుతున్న నష్టాన్ని చక్కదిద్దే ఆలోచన చేయలేదు. ప్రభుత్వం కూడా సన్నాయి నొక్కులు నొక్కడం తప్ప హైకోర్టులో గట్టిగా తన అభిప్రాయం చెప్పలేదు. జపాన్ నుంచి అప్పు తెచ్చి అయిదేళ్లలో సాగర్ కాలుష్య నివారణ చేస్తామని గొప్పలు పోయింది. ఇప్పుడు అయిదేళ్లు గడిచిపోయాయి గనక ఏ మేరకు నియంత్రించిందీ కనిపిస్తూనే వుంది. హైకోర్టు తీర్పు అమలు చేయడంపై తొందరపాటు తగదని పాలక పక్ష ఎంఎల్ఎలు అప్పుడు వెనక్కు లాగారు కూడా. ఇక ఉత్సవ నిర్వాహకులైతే కలిగే నష్టం గురించి ఆలోచించకుండా మత భావాలు ప్రేరేపించే ప్రకటనలు గుప్పించారు. అప్పటికీ ఇప్పటికీ ఈ పరిస్థితి మారిందేమీ లేదు.

నిమజ్జనం అంటే ఏమిటి?

సైన్సు, పర్యావరణం వంటి వాటిని పక్కన పెట్టి పురాణాల ప్రకారం చూసినా ఇది పొరబాటే. ఎందుకంటే నిమజ్జనం అంటే బాగా కలిపేయడం. మజ్జిగ అన్న మాట అ విధంగా వచ్చిందే. 'నిరతి మజ్జనం నిమజ్జనం' అంటే బాగా కలిపేయడం. మట్టితో చేసిన విగ్రహాన్ని మట్టితోనే కలిపెయ్యడం ఇందులో పరమార్థం. కాని విగ్రహాలను చేసిందీ మట్టితో కాదు, అవి నీటిలో కలిసేదీ కరిగేదీ లేదు. పెద్ద పెద్ద క్రేన్లతో వాటిని లాంఛనంగా నీళ్లలో దింపడం, కాస్సేపట్లో ఒడ్డుకు చేరడం జరుగుతుంది. ఆ విగ్రహాల్లో వాడిన ఇనుప చువ్వలను తీసుకునిపోవడానికి వీధి పిల్లలు అప్పటికే సిద్ధంగా వుంటారు. మురికి మయంగా వున్న హుస్సేన్ సాగర్‌లో విగ్రహాలను వేయడమే ఒక విడ్డూరమైతే నిమజ్జనం కాకున్నా అక్కడే కలపాలని పట్టుపట్టడంలో ఏ విధమైన విశ్వాసాలు లేవు. నగర రాజకీయాలపై ప్రాబల్యం కోసం పాకులాట మాత్రమే వుంది. పురాణాలన్నిటిలోనూ చెరువులు బావులు తవ్వించడమే పుణ్య కార్యమని చెబుతున్నాయి తప్ప విష పూరితం చేయమని చెప్పవు. సప్త సంతానాలనే వాటిలో జలాశయాలను భాగంగా చెబుతాయి.

108 అడుగుల గణేష్

మహావిశాఖ పరిధిలోని గాజువాక లంక మైదానంలో 108 అడుగుల గణేష్ విగ్రహాన్ని తయారుచేస్తున్నారు. ఇది రాష్ట్రంలోకెల్లా అతి పెద్ద వినాయక విగ్రహం. విశాఖజిల్లా అనకాపల్లి గవరపాలేనికి చెందిన రమేష్ ఆధ్వర్యాన కోల్‌కత్తాకు చెందిన 40 మంది కళాకారులు నెలరోజుల నుంచి విగ్రహ తయారీ పనుల్లో ఉన్నారు. కాకపోతే విగ్రహ తయారీలో ఎటువంటి రసాయనాలనూ వినియోగించడం లేదు. వెదురుకర్రలు, మట్టిని మాత్రమే వినియోగిస్తున్నారు. విగ్రహ తయారీకి కాశీ నుంచి 10 లారీల మట్టిని తెప్పించారు. దీనికి సుమారు రూ.50 లక్షల వరకూ ఖర్చవుతుందని అంచనా. 2009, 2010 సంవత్సరాల్లో ఇక్కడ 76 అడుగుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 108 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి పొందారు. ఈ విగ్రహాన్ని నిర్మించిన చోటే నిమజ్జనం చేస్తారు. ఒక ట్యాంకర్ పాలు, 10 ట్యాంకర్ల నీటితో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు.

-టి.రమణారావు, గాజువాక.

మహాభారతం శాంతి పర్వంలో భీష్ముడు గాని, భగవద్గీతలో కృష్ణుడు గాని ఈ విషయమే చెప్పారు. వటపత్ర శాయి అని విష్ణువును తాటాకుపై పడుకున్నట్టు చూపించడంలోనూ మూషికాన్ని వినాయక వాహనంగా చేయడంలోనూ ప్రకృతి ముద్ర ప్రస్ఫుటంగా వుంది. పర్వత రాజ పుత్రి పార్వతి అనడంలోనూ ప్రకృతి భావన వుంది. ఇన్ని విధాల ప్రకృతితో ముడిపడినవినాయక విగ్రహాలను ప్రకృతి సూత్రాలకు హాని కలిగించే విధంగా కాలుష్య భరితం చేయడం ఎక్కడి ధర్మం అంటే సమాధానం వుండదు.

ఇంత పెద్ద విగ్రహాలను తయారు చేయడమే పురాణ ధర్మం కాదు. ముందే చెప్పినట్టు ఒక సామాజిక నేపథ్యంలో మూల విరాట్టు ప్రతినిధులుగా వుత్సవ విగ్రహాలు తయారైనాయి. జనం మధ్యకు వచ్చే విగ్రహాలు చిన్నవిగా కదిలించడానికి వీలుగా వుండాలి. మరీ పెద్దవైతే ప్రజా భద్రతకు ప్రమాదం గనకే పల్లకీలోనో పారువేటలోనో వూరేగించేందుకు వీలైన పరిణామంలోనే చేస్తారు. అసలు ఉత్సవ విగ్రహాలు ఎంత వుండాలో కూడా శాస్త్రాలు చెబుతున్నాయి. దేశంలో శ్రావణ బెళగొళ వంటి జైన దిగంబరుల విగ్రహాలు వుండేమాట నిజమే గాని అవి కదిలేవి కావు. హుస్సేన్‌సాగర్ మధ్యలో బుద్ధ విగ్రహం ఎంత పెద్దదైనా సమస్య ఏముంది? కాని గణేశ విగ్రహాలకు వచ్చే సరికి కావాలనే వాటిని పెద్దవి చేసి లేనిపోని సమస్యలకు కారణమవుతున్నారు. వినాయక విగ్రహాల రూపకల్పనలోనూ ఈ విపరీతమే మనకు కనిపిస్తుంది. సినిమా హీరోల తరహాలోనూ క్రికెట్ కప్పులు రూపంలోనే వాటిని చేస్తుంటారు. రకరకాల వేషాలు వేయిస్తుంటారు. అపరిచితుడు చిత్రం వచ్చినపుడు అలాగే జులపాలతో చేశారు. ఇదంతా ఏ శాస్త్రాల ప్రకారం జరుగుతుందో చెప్పరు. అలాగే విద్యుచ్ఛక్తి సాయంతో చేయినో తొండాన్నో కదిలించేలా కూడా ఏర్పాటు చేస్తుంటారు. కొన్ని సరదాగా వున్నంత వరకూ పర్వాలేదు గాని ఎబ్బెట్టుగానూ ఇబ్బందిగానూ వుంటే ఎలా?

పర్యావరణ గణేశులు

ఇలాటి వాతావరణంలో పర్యావరణ పరిరక్షణ దృష్టితో ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రచారం చేస్తున్న సంస్థలున్నాయి. జన విజ్ఞాన వేదికకు తోడు గ్రీన్ కాప్స్, ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి బంకమట్టి వినాయకులను చేసేందుకు శిక్షణ సరఫరా కూడా ఇస్తున్నారు. ఆ మట్టి కూడా అందజేస్తారు. ఈ విగ్రహాలు అయిదు రూపాయలకే వస్తాయి. ఈ పర్యాయం స్కూలు పిల్లలు అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా విగ్రహాల తయారీలో ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వ హస్త కళల సంస్థ లేపాక్షిలోనూ ఈ విగ్రహాలు లభిస్తాయి. నిమజ్జనం కోసం అన్ని విగ్రహాలను ఒకేసారి హుస్సేన్ సాగర్‌కు తీసుకుపోయే బదులు నగరంలో వివిధ చోట్ల వున్న చెరువులను కాల్వలను ఉపయోగించుకోవడం మంచిది. ఆ విధంగానే ఐడిఎల్ చెరువు దుర్గం చెరువు, హిమయత్ సాగర్ వంటి చోట్ల క్రేన్లు ఏర్పాటు చేస్తారు. విశాఖలో సముద్రం, చాలా పట్టణాల్లో నదులు వున్నాయి గనక అక్కడా నిమజ్జనం చేయొచ్చు. ఏమైనా వినాయక చవితిని తమ ప్రచారానికి ప్రాబల్యానికి పావుగా ఉపయోగించుకునేవారి పట్ల అప్రమత్తంగా వుండాల్సిందే. మత వేడుకలైనా శాంతి సామరస్యాలు పెంచాలి గాని ఉద్రిక్తతకు, కాలుష్యానికి దారి తీయకూడదు. విఘ్నాలను తొలిగిస్తాడని చెప్పే వినాయకుడి విగ్రహాలనే విఘ్నాలుగా మార్చకూడదు.

- వేమన

అటుకుల లడ్డు

కావలసిన పదార్థాలు

అటుకులు - పావుకేజీ, బెల్లం - పావుకేజీ, పచ్చికొబ్బరి తురుము - 1 కప్పు
నెయ్యి - 50 గ్రా, జీడిపప్పు - 6, కిస్‌మిస్ - 10, యాలకులు - 5

తయారు చేయు విధానం

అటుకులను దోరగా వేయించి పొడి చేసుకోవాలి. బెల్లాన్ని తురుముకోవాలి. అటుకుల పొడి, బెల్లం తురుము, పచ్చికొబ్బరి తురుము యాలకుల పొడి బాగా కలపాలి. నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లను ఈ మిశ్రమంలో కలిపి చిన్న చిన్న లడ్డులు చేసుకోవాలి. ఇవి చాలా రుచిగా వుంటాయి.

- సింగంపల్లి భానురేఖ, రాయచోటి, కడప.

కద్దూ కట్లెట్

కావలసిన పదార్థాలు

సొరకాయ - 1 చిన్నది, బియ్యం పిండి - 5 స్పూన్లు
పచ్చిమిర్చి పేస్ట్ - 2 స్పూన్లు, కొత్తిమీర - 2 స్పూన్లు
జీలకర్ర - 2 స్పూన్లు, తరిగిన కరివేపాకు - 2 స్పూన్లు
ఉల్లిపాయ - 1, ఉప్పు - తగినంత, పెసరపప్పు - 3 స్పూన్లు
నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

సొరకాయని తురుముకోవాలి. దానిలో పచ్చిమిర్చి పేస్ట్, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు, నానబెట్టిన పెసరపప్పు, తరిగిన కరివేపాకు, కొత్తిమీర, జీలకర్ర, బియ్యంపిండి వేసుకుని ముద్దగా కలపాలి. అదనంగా నీళ్ల పొయ్యకుండా సొరకాయ రసంతోనే ముద్దవుతుంది. అవసరమైతే మరికొంత బియ్యంపిండి వేసుకోవచ్చు. ఈ ముద్దని చిన్న చిన్న వుండలు చేసుకుని గారెల్లా చేసి కాగిన నూనెలో దోరగా వేయించాలి. వీటిని వేడివేడిగా తింటే క్రిస్పీగా చాలా బావుంటాయి.

స్నేహ, హైదరాబాద్.





శనగపప్పు పారోళీ

కావలసిన పదార్థాలు

పచ్చిశనపప్పు - పావుకేజీ

అల్లం - చిన్న ముక్క, జీలకర్ర - 1 టీ స్పూన్
పచ్చిమిర్చి - 4, ఉల్లిపాయలు - 4
కరివేపాకు - 4 రెమ్మలు, మినపప్పు - 1 స్పూన్
ఆవాలు - 1 స్పూన్, నూనె - 4 స్పూన్లు, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

పచ్చిశనగపప్పు ఓ గంట నానబెట్టాలి. అందులో అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఇడ్లీ కుక్కర్‌లో పెట్టి పది నిమిషాలు అవిరి మీద ఉడికించాలి. ఆరిన తర్వాత వీటిని ఓ నిమిషం మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి. పొయ్యిమీద మూకుడు పెట్టి నూనెవేసి కాగనివ్వాలి. అందులో ఆవాలు, మినపప్పు, ఉల్లిపాయ ముక్కలు, కరివేపాకు వేసి వేయించాలి. తర్వాత పొడిచేసిన పెసరపప్పు ముద్దని కూడా వేసి పదినిమిషాలు వేయించాలి. ఈ కూర అన్నంలోకి బాగుంటుంది.



కొబ్బరి పరమాన్నం

కావలసిన పదార్థాలు

బియ్యం - పావుకేజీ, పంచదార - అరకేజీ, పాలు - 1 లీటరు
కొబ్బరి - సగం చిప్ప, యాలకులు - 4, జీడిపప్పు - 10

తయారు చేసే విధానం

బియ్యం రెండు గంటలు నానబెట్టాలి. వాటిలో కొబ్బరి వేసి మెత్తగా రుబ్బాలి. వెడల్పు గిన్నెలో పాలుపోసి బాగా మరగబెట్టాలి. అందులో బియ్యం, కొబ్బరి రుబ్బిన మిశ్రమాన్ని వేసి కలపాలి. సన్న సెగమీద అడుగంటకుండా ఐదు నిమిషాలు ఉడికించాలి. తర్వాత పంచదార వేసి మరో పదినిమిషాలు ఉడికించాలి. దించేముందు యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు పలుకులు వేసి కలుపుకోవాలి.అంతే వేడి వేడి కొబ్బరి పరమాన్నం రెడీ. ఇది వేడిగా తిన్నా, చల్లారాక తిన్నా రుచిగానే ఉంటుంది. ఇది మినప దోశల్లోకి కూడా మంచి కాంబినేషన్.

- ఎం. సాయిలక్ష్మీ జోగేశ్వరి, చోడవరం, విశాఖ.

వ్యక్తిత్వ స్ఫూర్తి.. శాస్త్రీయ దీప్తి.. శాంతికి దిక్సూచి



ఐన్‌స్టీన్ పేరు వినగానే మనకు సాపేక్ష సిద్ధాంతమే గుర్తుకు వస్తుంది. గొప్ప శాస్త్రవేత్తగా గౌరవభావం కలుగుతుంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎన్నో చిక్కు సమస్యలకు జవాబులు చెప్పిన ఈయన సామాజిక, రాజకీయ సమస్యలకూ పలు రకాల పరిష్కారాలు చూపారు. శాస్త్రవేత్తగానే కాకుండా రాజకీయవేత్తగానూ, సామాజికవేత్తగానూ ప్రఖ్యాతిగాంచారు. ప్రపంచశాంతి, మానవాభివృద్ధి కోసం పరితపించిన ఐన్‌స్టీన్ ఈ రెండో పార్శ్వం గురించి నేడు చాలా కొద్ది మందికే తెలుసు. తన సమకాలీన సమాజం, ప్రపంచంలో జరిగిన వివిధ ఘటనలకు ఆయన స్పందించిన తీరు, ప్రపంచ శాంతి కోసం చేసిన కృషి, మానవాభ్యున్నతికోసం ప్రయత్నించిన తీరు ఆయన ఎంతటి మహోన్నతుడన్నది తెలుపుతుంది. ప్రపంచీకరణ పేరిట సామ్రాజ్యవాదులు సృష్టిస్తున్న ఆక్రమణల అలజడులతో కుదేలవుతున్న ప్రస్తుత ప్రపంచానికి అంతటి మహానుభావుడి అవసరం ఎంతో అర్థమవుతుంది. మన మధ్యన ఇప్పుడాయన లేకపోయినా ఆ వ్యక్తిత్వాన్ని, కృషిని ఆదర్శంగా తీసుకుంటే ఎంతో మంది ఐన్‌స్టీన్‌లు తయారు కావచ్చు. తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించే ఐన్‌స్టీన్ జర్మనీలో అతిగా వేళ్లూనుకున్న జాతీయ వాదాన్ని నిరసిస్తూ 'అది మానవత్వానికి మచ్చ' అని అభివర్ణించాడు. నాడు ఆయన చెప్పిన ఈ విషయం ప్రస్తుతం పలు దేశాల్లో వికృతరూపం చూపుతున్న జాతీయవాదాన్ని అంతం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. ఆయుధ పరిశ్రమను 'జాతీయ వాదం వెనుకనున్న దుష్టశక్తి' అని ప్రకటించిన ఆయన శాంతి గురించి నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తిగా, వామపక్షవాదిగా, అంతర్జాతీయ దృక్పథంగల విజ్ఞుడిగా ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాడు. ఫాసిజానికి వ్యతిరేకంగా తీవ్ర ప్రచారం కొనసాగించాడు. రెండో ప్రపంచ యుద్ధం చివరలో జపాన్‌పై అమెరికా అణుబాంబును వేయడాన్ని ఐన్‌స్టీన్ తీవ్రంగా వ్యతిరేకించాడు. అటు తర్వాత అణ్వాయుధాలు, ఉగ్రవాదాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు, సంస్థలకూ గట్టి మద్దతునిచ్చాడు. ఈ క్రమంలో ఆయన అమెరికాలోనూ పలు అవమానాల పాలయ్యాడు. కష్టనష్టాలెన్ని ఎదురైనా ఏమాత్రమూ వెనుకంజ వేయకుండా శాస్త్రీయ వికాసం, సామాజిక పురోగతి, శాంతిసామరస్యంతో కూడిన ప్రపంచం కోసం అడుగడుగునా కృషి చేసిన ధన్యజీవి ఐన్‌స్టీన్ జీవితాన్ని, చేసిన కృషిని సులభశైలిలో ఈ పుస్తకం ద్వారా మనకందించింది ప్రజాశక్తి బుక్‌హౌస్. స్ఫూర్తి, ఉత్తేజం నింపుతూ శాస్త్ర, సాంకేతిక, సామాజిక, రాజకీయార్థిక రంగాల్లోని వారిని సరైన మార్గంలో నడిపించే ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదివి తీరాలి.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ : సామాజిక రాజకీయ రచనలు,
పేజీలు : 86, వెల : రూ.30/-, ప్రచురణ : ప్రజాశక్తి బుక్‌హౌస్,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, ఇతర అన్ని ప్రముఖ పుస్తకాలయాలు.

కొత్త పుస్తకాలు

సమాచార ప్రదాయిని

Politics are the part and parcel of our life. But usually people reluctant to know about politics...

'...రాజకీయాలు మనను శాసిస్తాయి. సమాజాన్ని నియంత్రిస్తాయి. విభిన్న వర్గాల మనుషులను సమైక్యంగా ప్రగతి పథంలో నడిపిస్తూ మన జీవితంలో భాగమైపోయాయి. అయినా కూడా చాలామంది రాజకీయాలంటే అయిష్టత చూపుతారు. దూరదూరంగా మసలుకుంటూంటారు. కానీ మన వ్యక్తిగత జీవితాలకూ, సామాజిక జీవనాలకూ ఒక రూపునిస్తున్నది రాజకీయ వ్యవస్థే కాబట్టి దాని గురించి తెలుసుకోవడం... మనకవసరమైన విధంగా దానిని సరిదిద్దే ప్రయత్నం చేయడం మన కనీస విధి. ఈ విధిని నిర్లక్ష్యం చేయడమంటే మన భవిష్యత్తును మనమే అశ్రద్ధ చేయడమన్న మాట. అందుకనే నిత్యం మన చుట్టూ జరుగుతున్న ఘటనలు..వార్తలు తెలుసుకుంటూ వుండాలి. వాటి మంచి చెడ్డలు బేరీజు వేసుకుంటూ వాటిని బాగు చేసే ప్రయత్నం చేయాలి. ఈ విధిని సక్రమంగా నిర్వర్తించినప్పుడే మన జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి. సమాజం పురోగతిలో పయనిస్తుంది...' అని చెబుతున్నారు సామాజికవేత్తలు. ఇది జరగడం లేదు కాబట్టే వ్యవస్థ ఇలా భ్రష్టు పట్టిపోతోంది అని వారు సోదాహరణంగా చెబుతున్నారు. మనం నిర్వహించాల్సిన ఈ కర్తవ్యాన్ని సులభతరం చేసే ఒక మంచి సమాచార సాధనంగా మనకందుబాటులోకి వచ్చింది 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు...రాజ్యాంగ వ్యవస్థలు, కీలక పరిణామాలు, ఉద్యమాలు' పుస్తకం. రాష్ట్ర ఏర్పాటుకు నేపథ్యంగా ఉన్న ఫెడరల్ వ్యవస్థ నుంచీ మొదలుకుని రాష్ట్రం



ఏర్పాటు, దానిని నడిపించే గవర్నరు, ముఖ్యమంత్రి, మంత్రివర్గం, శాసనసభ, న్యాయవ్యవస్థ, సచివాలయం, ఉద్యమాలు, రాజకీయ పార్టీలు, ఎన్నికలు వంటి వ్యవస్థల గురించి ఈ పుస్తకం తెలుపుతుంది. వీటి పుట్టుపూర్వోత్తరాలు, ఏర్పాటైన నాటి నుంచీ చోటు చేసుకుంటున్న మార్పులు, ఏ పరిణామాలు దానిని ప్రస్తుత రూపంలోకి తీసుకొచ్చాయి? వాటి వెనుక ఎవరున్నారు? తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా గుదిగుచ్చి మనకందించింది. ఈ వివరాలు తెలుసుకుంటే ఆయా వ్యవస్థలను మన స్వేచ్ఛాయుత మనుగడ, పురోగతికి సాధనంగా ఎలా వాడుకోవచ్చో తేటతెల్లమవుతుంది. ప్రజాస్వామ్యంలో మనను మనమే పాలించుకునే విచక్షణా శక్తి లభిస్తుంది. ముఖ్యంగా విద్యార్థులు, పోటీ పరీక్షార్థులకు జనరల్ స్టడీస్, జనరల్ నాలెడ్జ్ టూల్‌గానూ, నాయకులు, సామాజికవేత్తలకు రెఫరెన్స్ టూల్‌గానూ ఉపకరిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు(1919-2010) : రాజ్యాంగ వ్యవస్థలు, కీలక పరిణామాలు, ఉద్యమాలు, -ఆచార్య మారంరాజు సత్యనారాయణరావు, పేజీలు : 316, వెల : రూ.125/-లు, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

- ఎన్. మదనయ్య



కొంచెం కెమిస్ట్రీ తెలుసుకుందాం

మనం భుజించే ఆహారంలో, వేసుకునే డ్రస్‌లో, ఉపయోగించే వస్తువుల్లో సైన్సు ఉంటుంది. మరింత ఖచ్చితంగా చెప్పాలంటే కెమిస్ట్రీ ఉంటుంది. మనకు ఇష్టమున్నా లేకున్నా తరచూ కెమిస్ట్రీ పదాలు వాడాల్సి వస్తుంది. అందుకే దాని గురించి కొంత ప్రాథమిక విజ్ఞానం తెలిస్తే మంచిది.

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

షాంపూ బాటిల్ మీద 'ph బ్యాలెన్స్‌డ్' అని రాసి ఉంటుంది. వాడకం దారు దాని గురించి షాపు యజమానిని అడిగితే ఏదో జవాబు చెప్పాలి కాబట్టి 'జుట్టును మెత్తగా ఉంచుతుందని చెప్తాడు.

మనం కొనుగోలు చేసే వంట పదార్థాలు మొదలు సౌందర్య సాధనాలు, పారిశుధ్య పదార్థాల వరకు పరిశీలిస్తే వాటిలో అనేక రసాయన పదార్థాలు, ఘటక మూలకాలు ఉంటాయి. వీటిలో చాలా పేర్లు ఎక్కువమందికి వింతగా ఉంటాయి. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ వీటి గురించి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఏఏ సామాన్లు ఇంట్లోకి కొనుగోలు చేసుకోవాలో నిర్ణయించుకోవాలి కాబట్టి. అందరికీ ఉపయోగపడే కొన్ని కెమిస్ట్రీ పదాలను పరిచయం చేసుకుందాం.

ఆమ్లము (యాసిడ్)

ఇది రుచికి పుల్లగా ఉంటుంది. చాలా ఆమ్లాలు హానికరం కాదు (నిమ్మరసం వంటివి). కానీ బలమైన ఆమ్లాల వల్ల శరీరం కాలుతుంది.

క్షారము (ఆల్కలీ)

ఇది ఆమ్లాన్ని తటస్థీకరిస్తుంది. చేదుగా ఉంటుంది. బలమైన క్షారాలు చర్మానికి హాని చేస్తాయి. ఉదాహరణకు కాస్టిక్ సోడా.

ఆల్జినేట్

ఈ పదార్థాన్ని సముద్రపు పాచినుండి తయారు చేస్తారు. ఐస్‌క్రీమ్ తయారీలో దీన్ని ఉపయోగిస్తారు. ఆహారపరిశ్రమలో పదార్థాలు గట్టిపడేందుకు దీన్ని వాడతారు.

యాలమ్ (పటిక)

అల్యూమినియం, పొటాషియం సల్ఫేటు స్ఫటికం. చర్మం అందంగా, మృదువుగా తయారయ్యేందుకు దీనితో చేసిన లోషన్ వాడతారు.

యనాల జిసిక్

ఇది శరీరంలోని నొప్పులు, బాధలను తగ్గించే ఔషధం. యాస్ప్రిన్ దీనికి ఉదాహరణ.

యాంటాసిడ్

కడుపులోని ఆమ్లతత్వాన్ని తగ్గించే పదార్థం. బజారులో దొరికే యాంటాసిడ్లలో సోడియం బైకార్బనేట్ (వంట సోడా), అల్యూమినియం హైడ్రాక్సైడ్లు ఉంటాయి.

యాంటీ బయాటిక్

శరీరంలో వాంఛనీయం కానీ ఆర్గానిజం పెరుగుదలను అరికట్టే రసాయన పదార్థం. ఉదాహరణకు పెన్సిలిన్, యాంపిసిల్లిన్.

యాంటీ పైరెటిక్

శరీర జ్వరం లేదా ఎక్కువ ఉష్ణోగ్రతను తగ్గించే ఔషధం. పారాసిటమాల్ మనకు బాగా తెలిసిన యాంటీ పైరెటిక్.

బయోటిన్

విటమిన్ బి గ్రూపుకు చెందినది. శరీరం ఆరోగ్యంగా ఉండేందుకు ఇది అవసరం. ఇది తక్కువైతే చర్మ సంబంధిత వ్యాధులు రావచ్చు.

బోరిక్ ఆమ్లం

ఇది తెల్లగా ఉండే పొడరు. యాంటీసెప్టిక్‌గా వాడతారు. దీన్ని జలద్రావణంగా చేసి కళ్లు శుభ్రం చేసేందుకు వాడతారు.

క్యాలమైన్

ఇందులో జింక్ కార్బనేటు ఉంటుంది. చర్మ సంబంధ సమస్యల నుండి ఉపశమనం కలిగేందుకు దీన్ని రాస్తారు. ఇది పేస్టు లేదా ద్రావణ రూపంలో దొరుకుతుంది. పొడరుగా

కూడా లభిస్తుంది.

కార్బాలిక్ యాసిడ్

సాధారణంగా దీన్ని ఫినాల్ అని పిలుస్తారు. చాలా ఘాటైన వాసనగల ద్రావణం. బాత్‌రూములు, టాయిలెట్లలో క్రిమిసంహారకంగా దీన్ని ఉపయోగిస్తారు.

సిట్రిక్ యాసిడ్

సహజంగా ఇది పండ్లలో లభిస్తుంది. కృత్రిమంగా కూడా తయారుచేస్తారు. తెల్లని స్ఫటికాలుగా తయారవుతుంది. ఆహార పదార్థాలను నిల్వచేసేందుకు ఉపయోగిస్తారు. సాఫ్ట్‌డ్రింకుల్లో గాఢత చెందించేందుకు కూడా దీన్ని వాడతారు.

డీనేచర్డు స్పిరిట్

ఇది మనుషులు తాగడానికి పనికిరాని ఆల్కహాల్. ఎక్కువగా దీన్ని పరిశ్రమలు, ప్రయోగశాలల్లో వినియోగిస్తుంటారు. షేవింగ్ తర్వాత ఉపయోగించే లోషన్లలో, పెర్‌ఫ్యూమ్‌లు, టోనర్లు మొదలైన వాటి తయారీలో వినియోగిస్తారు.

ఇమల్షన్

నూనె, నీరు విడిపోనంత బలంగా చేసిన మిశ్రమం ఇది. క్రీములు, పాలు, క్రీమీలోషన్ల వంటివి దీనికి ఉదాహరణలు.

ఇక్స్ పెక్టొరెంట్

దగ్గు వచ్చినపుడు గొంతులో ఉన్న కఫాన్ని బలంగా బయటికి గెంటగల ఔషధం.

ఫ్లోరైడ్

ఫ్లోరిన్ వాయువు యొక్క సమ్మేళన పదార్థం. దీన్ని నీటికి లేదా పేస్టుకి కలుపుతారు. ఫలితంగా దంతక్షయం నుండి రక్షణ లభిస్తుంది.

ఫ్యూమిగంట్

దీనిని మండించిన తర్వాత వచ్చే పొగ వల్ల కీటకాలు నశిస్తాయి. చీడలు నివారించబడతాయి.

గ్లాసియల్ ఎసిటిక్ యాసిడ్

స్వచ్ఛమైన గాఢ ఎసిటిక్ యాసిడ్‌ను ఈ విధంగా పిలుస్తారు. ఈ ఆమ్లం నీటిలో బాగా విలీనమై ఉంటే దాన్ని వెనిగర్ అంటారు.

గ్లిజరైడ్స్

ఆమ్లంతో కలిసిన గ్లిజరిన్. కొవ్వులు, నూనెలు ఇవన్నీ గ్లిజరైడ్స్. ఇందులో రెండు రకాలు ఉంటాయి. 1. సంతృప్త గ్లిజరైడ్స్ 2.అసంతృప్త గ్లిజరైడ్స్.

హార్డ్ వాటర్

మెగ్నీషియం, కాల్షియం లవణాలు కరిగిన నీరు. సబ్బుతో చాలా తక్కువ నురగను ఇస్తుంది.

హైడ్రోజన్ పెరాక్సైడ్

ఈ ద్రవాన్ని నీటిలో బాగా విలీనం చేసి జుట్టు బ్లీచ్ చేసుకునేందుకు, దంతాలను శుభ్రం చేసుకునేందుకు ఉపయోగిస్తారు.

అయోడిన్

యాంటీసెప్టిక్‌గా ఉపయోగించే సమ్మేళనం. చర్మం తెగినప్పుడు లేదా గాయాలైనప్పుడు దీన్ని వాడతారు.

కెరాటిన్

చేతిగోళ్ళు, జుట్టు తయారయ్యేందుకు ఉపయోగపడే పదార్థం.

లెనోలిన్

ఇది శుభ్రపరిచిన ఊలు కొవ్వు. ఆయింట్‌మెంట్లు, సౌందర్యద్రవ్యాల్లో వాడడం వల్ల చర్మం మృదువుగా తయారౌతుంది.

మెంథాల్

తెల్లని మంచువలె ఉండే ఘాటైన వాసనగల పదార్థం. దీన్ని చర్మం మీద రాసుకుంటే చల్లగా ఉంటుంది. ఆహార ఉత్పత్తుల్లోను, సౌందర్య ద్రవ్యాల్లోనూ దీన్ని ఉపయోగిస్తారు.

ఆగ్జాలిక్ యాసిడ్

మొక్కలు, ఎరుపురంగు ఉండే కర్రలో ఈ ఆమ్లం యొక్క లవణాలు కనిపిస్తాయి. దీనిని సున్నపు నీటితో కలిపి బట్టలమీద తుప్పు మరకలు పోయేందుకు ఉపయోగిస్తారు. రంగుల తయారీ, బ్లీచింగ్, ఇంకు తయారీలో ఈ యాసిడ్‌ని వాడతారు.

ఓజోన్

ఇది ఆక్సిజన్ రూపాంతరం. ఇటీవల కాలంలో దీని ప్రాముఖ్యత బాగా పెరిగింది. భూమి పైవాతావరణంలో గొడుగులా విస్తరించి వున్న ఓజోన్ పొర పలుచబడితే ప్రమాదం.

ph విలువ

ఒక ద్రావణం యొక్క ఆమ్లతత్వం లేదా క్షారతత్వం యొక్క పరిమాణాన్ని తెలిపే కొలమానం. దీని విలువ 0 నుండి 14 వరకు ఉంటుంది. ఒక ద్రవం ph విలువ 7 అంటే అది తటస్థ ద్రవం. దాని విలువ 0 నుండి 7 లోపులో ఉంటే అది ఆమ్లద్రావణం. 7 దాటి 14 వరకు ఉంటే అది క్షారద్రావణం. మన చర్మం కొద్దిగా ఆమ్లస్వభావం కల్గి ఉంటుంది.

పాశ్చరైజింగ్

65 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ద్రవపదార్థాలను వేడి చేయడం (ఉదాహరణకు పాలు) వల్ల వాటిలోని బ్యాక్టీరియా మరణిస్తుంది. ఈ ప్రక్రియనే పాశ్చరైజింగ్ అంటారు.



పాలిథిన్

ఇథిలిన్ నుండి తయారైనదే ప్లాస్టిక్. సులువుగా ఎలా పడితే అలా వంగే విధంగా ప్యాకింగ్‌కు ఉపయోగపడే వాటర్ ప్రూఫ్ పదార్థం.

ప్యూమైస్

స్పాంజ్ మాదిరిగా ఉండే ఒక రాయి. శరీరం మీది మృత కణాలను, కేశాలను తొలగించేందుకు వాడతారు.

శాలిసిస్లిక్ యాసిడ్

ఇది ఒక ఔషధం. పాదాల్లో ఏర్పడే ఆనెకాయల చికిత్సకు, చర్మం ముతగ్గా ఉంటే మృదువుగా చేసేందుకు దీన్ని ఆయింట్‌మెంట్ రూపంలో వాడతారు.

శాకరిన్

టాన్విన్ నుండి తయారైన పొడరు రూపంలో ఉండే స్వీటు. ఇది ఒక రసాయన పదార్థం. పంచదారకు బదులుగా షుగర్ పేషెంట్లు దీన్ని వాడతారు.

టిసిసి

ఇది ట్రై క్లోరో కార్బన్ సంక్షిప్తకు రూపం. బ్యాక్టీరియా నాశిని. శరీర దుర్వాసన పోగొట్టేందుకు సబ్బుల తయారీలో పెద్ద పెద్ద కంపెనీలు డియోడిరెంట్ రకం సబ్బుల్లో దీన్ని కలుపుతారు.

టాక్సిన్లు

శరీర కణాల్లో బ్యాక్టీరియా ఉత్పత్తి చేసే విషపూరిత పదార్థాలను టాక్సిన్లంటారు.

టెఫ్లాన్

అంటుకోని (నాన్‌స్టిక్), ఉష్ణ నిరోధక తలం గల వాటిని తయారు చేసేందుకు పాలిటెట్రాఫ్లోరో ఎథిలిన్ పదార్థాన్ని ఉపయోగిస్తారు. అలా తయారైనదే టెఫ్లాన్.

వల్కనైజ్డ్ రబ్బరు

రబ్బరును గంధకంతో కలిపి తయారు చేసినదే వల్కనైజ్డ్ రబ్బరు. ఇలా చేయడం వల్ల రబ్బరు గట్టిపడి దాన్ని ఆకృతి ఏ రూపంలో మలిస్తే ఆ రూపంలో చెడకుండా ఉంటుంది. మోటారుకార్ల టైర్లు వల్కనైజ్డ్ రబ్బరుతో తయారౌతాయి.

రసాయన పదార్థాలన్నీ ప్రమాదకరమైనవి కావు. ఈ విషయం ఇంతవరకు మనం తెలుసుకున్న కొన్ని పదార్థాలను బట్టి మీరు గ్రహించగలరు. మన శరీరంలో తయారయ్యే చెమట, రక్తం, మూత్రం, చీము వంటివన్నీ రసాయన పదార్థాలే. అయితే ఇవన్నీ శరీరం తుల్యతతో ఉండే విధంగా అదుపులో ఉంటాయి. పైన చెప్పుకున్న ఏ రసాయనపదార్థాన్ని కొనుగోలు చేసినా దాన్ని ఎలా వినియోగించాలో తెలియజేసే సూచనలు తప్పనిసరిగా చదివి పాటించాలి. ★

F	I	H	A	W	K	O	S	T	R	I	C	H
L	B	U	Z	Z	A	R	D	V	G	J	Y	P
A	I	R	N	P	H	E	A	S	A	N	T	U
M	S	E	C	O	N	D	O	R	N	T	P	F
I	S	A	J	F	A	L	C	O	N	L	A	F
N	H	G	O	O	S	E	R	S	E	A	R	I
G	E	L	P	A	R	R	O	T	T	R	T	N
O	R	E	R	V	S	J	W	A	V	K	R	N
K	O	O	K	A	B	U	R	R	A	W	I	R
R	N	K	E	S	T	R	E	L	L	R	D	O
P	E	N	G	U	I	N	J	I	V	E	G	B
V	U	L	T	U	R	E	I	N	L	N	E	I
C	A	N	A	R	Y	P	I	G	E	O	N	N

ఎక్కడున్నాయో కనిపెట్టండి!?

చిన్నారులూ... పైన ఆంగ్ల అక్షరాల సమూహం ఉంది. అందులో కొన్ని పక్షుల పేర్లు దాగున్నాయి. అవి అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఎలాగైనా ఉండొచ్చు. ఇప్పుడు మీరు వాటిని వెతికి పట్టుకోవాలి.

ఐదుతో నాలుగు

హాలో ఫ్రెండ్స్... ఇక్కడ అగ్గిపుల్లలతో చేసిన ఐదు చతురస్రాలను ఇచ్చాం. అవే అగ్గిపుల్లలతో నాలుగు చతురస్రాలు చెయ్యాలి. ఏ పుల్లలు తీసి ఎక్కడ పెడితే నాలుగు చతురస్రాలు వస్తాయో చూసి చకచకా పెట్టేయండి మరి.



ఇసుకతో ఫ్లవర్ వాజ్

పిల్లలూ... ఈ రోజు ఫ్లవర్ వాజ్ చేయడమెలాగో నేర్చుకుందామా? దీన్ని ఎంచక్కా మన ఇంట్లో టేబుల్ మీదో, టీవీ మీదో లేదా షోకేస్‌లోనో పెట్టుకోవచ్చు. తయారు చేయడం కూడా చాలా తేలిక. దీనికి కావలసిన వస్తువులు కూడా మన ఇంట్లో దొరికేవే.

ఏమేం వస్తువులు కావాలంటే...

మన ఇంట్లో వాడి పడేసిన సీసాలు ఉండే వుంటాయి కదా. అవి ప్లాస్టిక్ వైనా, గాజువైనా పర్లేదు. కాకపోతే గాజుసీసా ఐతే చూడ్డానికి బాగుంటుంది. అలాంటి సీసా ఒకటి, ఇసుక, ఫెవికాల్, బ్రష్, ఇష్టమైన రంగు.

ఎలా తయారు చేయాలంటే...

ముందు సీసాని శుభ్రంగా కడగాలి. దానిమీద ఏమైనా పేపర్ ఉంటే దాన్ని తీసెయ్యాలి. తడి పూర్తిగా ఆరిపోయేలా దాన్ని ఆరబెట్టాలి. ఇప్పుడు మనకిష్టమైన రంగుని ఇసుకలో కలపాలి. తర్వాత సీసా పైభాగమంతా బ్రష్‌తో ఫెవికాల్ రాయాలి. ఈ ఫెవికాల్ ఆరకముందే రంగు కలుపుకున్న ఇసుకని దానిపై అంటించాలి. సీసా చుట్టూ సమానంగా ఉండేలా జాగ్రత్తగా ఇసుకని అతికించుకోవాలి. ఇది పూర్తిగా ఆరిపోయేవరకు కదిలించకుండా ఓ పక్కన పెట్టాలి. ఆరిపోయిన తర్వాత చూడండి. ఎంత బాగుంటుందో! ఇష్టమైతే ఇసుకలో రెండు మూడు రంగులు కూడా కలుపుకోవచ్చు. కావాలంటే ఇంకా ఎక్కువ రంగులైనా వేసుకోవచ్చు. దీన్లో మన పెరట్లో పూసిన పూలను గుత్తిగా చేసి పెట్టి చూడండి. ఎంత అందంగా ఉంటుందో.



జవాబులు

[illegible]: 16

ఐదుతో నాలుగు:



ఎక్కడున్నాయో కనిపెట్టండి!?

BUZZARD, CANARY, CONDOR, CROW, EAGLE, FALCON, FLAMINGO, GANNET, GOOSE, HAWK, HERON, IBIS, KESTREL, KOOKABURRA, LARK, OSTRICH, PARROT, PARTRIDGE, PENGUIN, PHEASANT, PIGEON, PUFFIN, ROBIN, STARLING, VULTURE, WREN.

ఎవరి వయసెంత?

కొడుకు వయసు తండ్రి వయసులో మూడోవంతు వుంది. కానీ ఐదేళ్ల క్రితం తండ్రి వయసులో నాలుగోవంతు మాత్రమే కొడుకు వయసు ఉంది. అంటే ప్రస్తుతం కొడుకు వయసు ఎంత?

జవాబు : అబ్బాయి వయసు ప్రస్తుతం 15 సంవత్సరాలు. తండ్రికి 45 సంవత్సరాలు. ఐదేళ్ల క్రితం తండ్రి వయసు 40 ఏళ్లు. కొడుకు వయసు 10 సంవత్సరాలు. అంటే ప్రస్తుతం మూడు రెట్లు, ఐదేళ్ల క్రితం నాలుగు రెట్లు ఉన్నట్లే కదా.



ఏది ఎక్కడ?

నేస్తాలూ... ఇక్కడ ఓ విమానం బొమ్మ ఉంది. దానికి సంబంధించిన విడి భాగాలు కూడా ఆ పక్కనే ఉన్నాయి. మీరేం చేయాలంటే ఆ భాగాల్ని కత్తిరించి ఎలా అమరిస్తే కరెక్టుగా విమానం ఆకారం వస్తుందో చూసి పెట్టేసెయ్యండి.



చతురస్రాలెన్ని?

ఫ్రెండ్స్... పైన కొన్ని చతురస్రాలున్నాయి. అవి మొత్తం ఎన్నున్నాయో చెప్పాలి. అయితే ఎక్కువ సమయం తీసుకోకూడదు మరి. త్వరగా చెప్పేయాలి సరేనా.

తూటి పిట్టలు

ఇవి మన దేశానికి శీతాకాలంలో వలస వచ్చే పక్షులు. వీటికి పిచ్చుకలకు చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి. వీటిలో మగ పక్షులు ఎరుపురంగులో, ఆడ పక్షులు లేత ఆకుపచ్చ (ఆలివ్ గ్రీన్) రంగులో ఉంటాయి. వీటి ముక్కు బరువుగా, తోక చివర కొంచెం చీలినట్లు కనిపిస్తుంది. రెక్కలమీద లేత రంగు జంట చారలు కనిపిస్తాయి. ఇవి చల్లగా ఉండే ప్రాంతాలకు వలస వెళ్తాయి. వలసవెళ్లే సమయంలో మగ పక్షులు ముదురు గులాబీ రంగులోకి మారతాయి. ఇవి గుంపులుగా తిరుగుతాయి. ప్రతి గుంపులో పది నుండి ఇరవై పక్షులుంటాయి. పూల మొగ్గలను, రావి, మర్రి పళ్లను ఆహారంగా తీసుకుంటాయి. ఇవి ఎగురుతున్నప్పుడు సన్నగా పాట పాడినట్లు అరుస్తాయి. ఇవి చాలా చల్లని ప్రదేశాల్లోనే గుడ్లు పెడతాయి. అంటే కాశ్మీర్, హిమాలయ పర్వతాలు వంటి ప్రదేశాల్లో, ఎత్తైన ప్రదేశాల్లో మాత్రమే అన్నమాట. ఈ గుడ్లు ఎరుపు రంగు మచ్చలతో కూడిన నీలిరంగులో వుంటాయి.

చుక్కలు కలిపేద్దాం

నేస్తాలు! ఇక్కడ చుక్కల్లో ఏదో జీవి దాక్కుంది. అదేంటో చెప్పకోండి చూద్దాం. ఏంటి తెలియడం లేదా? అయితే 1 నుంచి 72 వరకు చుక్కలు కలిపి చూడండి.



మాటల కోట - 67

రూపకల్పన : కర్లపాలెం

1		■	2		3	■	4	5
	■	6		■	7		■	
■	8	■		■		■	9	■
10		■	■	■	■	11		
■	12	13	■	14	■	15		■
16			17	■	18			
■		■		■		■		■
19	■	20		■	21		■	22
23		■	24			■	25	

అడ్డం :

1. బంగారు నంది దక్కించుకున్న బాలకృష్ణ చిత్రం (2)
2. ఇంద్రుడి కూతురు, 'యమలీల' కథానాయిక (3)
4. చాగంటి సోమయాజులు పొట్టిపేరు (2)
6. ముసలితనం (2)
7. తీగె (2)
10. అమ్మ కాదు గానీ... అమ్మలా పెంచేది (2)
11. పోయిన ఏడాది (3)
12. బనారస్ ముందు సగం (2)
15. ముందూ వెనక లేని విరామము (2)
16. ప్రసిద్ధ భారతీయ ఆంగ్ల రచయిత, జమునను వెండి తెరకు పరిచయం చేసిన దర్శకుడు (4)
18. కృష్ణమాచార్యులు ఇంటిపేరు (4)
20. ఏడుపు (2)
21. హృదయం (2)
23. బుట్టకు ముందుండేది. రాయలసీమ వారి కంచం (2)
24. మూడు అంచెలు (3)
25. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ఊరిపేరు చెప్పమంటే తడబడతావేంటి? (2)

నిలువు :

1. సింధీల మాతృభాష (2)
2. జవహర్‌లాల్ నెహ్రూ కూతురు (3)
3. నీటిలో పుట్టినది (3)
5. హిందీ బంగారం (2)
8. పాండవులు కనపడని చిత్ర భారతం. విజయావారి విజయవంతమైన చిత్రం (5)
9. చారు ఒలికితే పడే మరక (5)
11. ఆశలేదు (3)
13. సగం నారాయణ (2)
14. మేక పలికే ఏకైక ఆంగ్ల పదం (1)
17. ప్రథమా విభక్తులు చెదిరిపోయాయి (4)
18. కుక్కకి ఇష్టమైన గుంట (4)
19. చలి (2)
22. దవడలో ఆ తినేదేమిటి? (2)

మాటలకోట - 66 జవాబు

1 కా	మ	క	■	2 సి	ని	3 మా	■	■
పీ	■	■	4 హా	ల	■	5 ధ	రి	6 త్రి
7 నం	8 ద్యా	ల	■	9 క	ర	పు	■	వ
■	ఉ	■	10 గ్యా	■	■	డు	■	ర్ణ
11 అ	నం	త	రం	■	12 ధా	■	13 చ	ప
వ	■	■	14 టీ	ము	కా	15 తృ	ర్య	తా
16 రో	జా	■	■	■	■	ఉ	■	క
హ	■	17 నూ	నె	■	18 వ	ల	19 య	ము
ణ	■	లు	■	20 సు	ధ	■	ర	■

సహజ జ్ఞానం

(అన్న పేరు అవుట్, చెల్లెలి పేరు ఇన్. ఒకరోజు వాళ్ల అమ్మానాన్నలతో బయటకు వెళ్లి ఆడుకొని వస్తామన్నారు. అయితే ఒక గంట తరువాత అవుట్ మాత్రమే ఇంటికి వచ్చాడు)

తండ్రి: ఇన్ రాలేదా?

హ్హా... హ్హా...

తల్లి: ఇద్దరూ కలిసే వెళ్లారు వచ్చేటపుడు ఒక్కరే వచ్చారేం?

తండ్రి: సరే నువ్వు బయటకు వెళ్లి చెల్లిని తీసుకురా

(అవుట్ బయటకు వెళ్లి కొద్ది నిమిషాల్లోనే చెల్లెలు ఇన్‌తో తిరిగి వచ్చాడు)

తల్లి: చెల్లెలు ఎక్కడ కనిపించింది నీకు?

అవుట్: (చిరునవ్వు నవ్వుతూ) 'సహజ జ్ఞానం' మమ్మీ

- సత్య

పులిరాజు



ఒక ఊరిలో తిమ్మరాజు అనే రైతు ఉండేవాడు. అతను ఓ సారి తన పొలంలో పండిన ధాన్యాన్ని పట్నంలో అమ్మేశాడు. షావుకారు ఇచ్చిన డబ్బును భద్రంగా జేబులో పెట్టుకుని అడవిలో నుండి నడిచి వస్తున్నాడు. ఇంతలో గాండ్రు... గాండ్రుమంటూ పెద్దపులి అరుపు వినిపించింది. భయంతో పరుగెత్తి నిటారుగా ఉన్న ఓ చెట్టెక్కి కూర్చున్నాడు.

పులి పరుగెత్తుకుంటూ వచ్చి ఆ చెట్టు దగ్గరే నిలబడిపోయింది. కళ్లముందున్న ఆహారం, నోట్లోకి రానందుకు దానికి చాలా కోపమొచ్చింది. ఎక్కడికీ వెళ్లకుండా చెట్టుకిందనే పడుకుంది. పులి ఎటూ వెళ్లకుండా అక్కడే ఉండడంతో తిమ్మరాజుకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. చెట్టుకొమ్మని గట్టిగా పట్టుకుని అలాగే కూర్చున్నాడు.

"ఇవాళ నిన్ను తినందే ఇక్కడ్నుండి కదలను" అంది పులి.

"అరే! ఈ పులి అచ్చంగా మనిషిలా మాట్లాడుతోందే. దీన్ని ఏదో ఒక ఉపాయంతో బురిడీ కొట్టించి, తప్పించుకోవాలి" అనుకున్నాడు తిమ్మరాజు.

"పులిరాజా! నువ్వంటే మా మనుషులకు భయమే కాదు. చాలా భక్తి, గౌరవం కూడా. నీ పేరుమీద అనేక నాటకాలు, సినిమాలు కూడా వచ్చాయి. పౌరుషానికి, ప్రతాపానికి నీ పేరే చెబుతుంటారు. కానీ నీకు తెలివితేటలు మాత్రం ఉండవంటారు. నిజమేనా?" అన్నాడు.

"ఎవరు ఆ మాటన్నది. మేం ఎంత అందంగా ఉంటామో, అంతకు రెట్టింపు పౌరుషంతో బతుకుతాం. ఎంత పౌరుషముందో అంతకు మూడు రెట్లు తెలివితేటలున్నాయి. ఆ తెలివితేటలతోనే మా ఉన్నతిని నిలబెట్టుకుంటున్నాం" అంది దర్పంగా.

"అయితే నీకు, నాకు ఒక పందెం. నువ్వు గెలిచావనుకో. నువ్వు చెప్పినట్లు నేను వింటా. నేను గెలిచాననుకో, నేను చెప్పిన పని నువ్వు చెయ్యాలి" అన్నాడు.

సరేనని పందేనికి ఒప్పకుంది పులి.

"ఒక రాజు ఒంటరిగా గుర్రం మీద అడవికి వేటకెళ్లాడు. ఓ జింకను తరుముతూ వెంట పడ్డాడు. అది ఒక దట్టమైన పొదలో దూరి తప్పించుకుంది. రాజు మాత్రం నిలబడిపోయిన గుర్రాన్ని ముందుకు అదిలించాడు. కానీ అది కదల్లేదు. తనే గుర్రం దిగి, కత్తి తీసుకుని పొదల్లోకి దూరాడు. అటూ, ఇటూ చూస్తూ నడుస్తున్న రాజు కాల్లో తెల్ల తుమ్మ ముల్లు విరిగింది. దాన్నెలా తీస్తాడో చెప్పు? నీకు మూడు అవకాశాలు ఇస్తున్నా. అప్పటికీ చెప్పలేకపోతే, నేను చెప్పినట్లు వినాలి సుమా" అన్నాడు తిమ్మరాజు.

"ఏముంది! తన చేతిలో కత్తి ఉంది కదా. దాంతో ఆ ముల్లుని తీస్తాడు" అంది పులి.

" ఎక్కడైనా కత్తితో ముల్లుని తీస్తారా?" నవ్వాడు తిమ్మరాజు.

"మరి పిన్నీసుతో తీస్తే వస్తుంది కదా?" అంది తెలివిగా.

"రాజు దగ్గర పిన్నీసు ఉండదు కదా" అన్నాడు తిమ్మరాజు.

"అవును కదా. సేవకులతో తీయించుకుంటాడు"

"ఒంటరిగా వెళ్లాడన్నాను కదా. నీ మూడు అవకాశాలు అయిపోయాయి. కనుక నేను చెప్పినట్లు వినాలి" అన్నాడు తిమ్మరాజు.

"సరే చెప్పు. ఏం చేయాలో" అంది పులి.

"నీ వీపున ఎక్కించుకుని అడవి పక్కనున్న పులిమడుగు ఊళ్లో నన్ను దింపెయ్యాలి" అన్నాడు.

"సరేగానీ, నువ్వు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పు. నాకు తెలుసుకోవాలని ఎంతో కోరికగా వుంది" అంది బతిమాలుతున్నట్లు.

"ఓసి పిచ్చిదానా! ముల్లుని ముల్లుతోనే తీసేశాడు. అడవిలో చాలా ముళ్ల చెట్లుంటాయి కదా. ఏదో ఒక చెట్టు ముల్లు తీసుకుని దాంతో తన కాల్లో ముల్లుని తీసేసుకున్నాడు" అన్నాడు తిమ్మరాజు.

అవును. నిజమే కదా! ముల్లుని ముల్లుతోనే తీయొచ్చు. ఈ ఆలోచన నాకెందుకు రాలేదబ్బా అనుకుని ...

"సరే మన ఒప్పందం ప్రకారం నిన్ను మీ ఊళ్లో దింపుతాను పద" అని కాళ్లు ముందుకు చాచి పడుకుంది పులి.

తిమ్మరాజు చెట్టు దిగి, పులిమీద ఎక్కి కూర్చున్నాడు. అది జామ్మంటూ ముందుకు పరుగుతీసింది.

పులిమీద ఎక్కి వస్తున్న తిమ్మరాజును చూసి గ్రామస్తులంతా తెగ ఆశ్చర్యపోయారు. భయంతో పరుగు తీశారు.

పులి తిమ్మరాజును తన వీపుమీదనుండి దింపేసి, అతని దగ్గర సెలవు తీసుకుని వెనుదిరిగింది.

ఆ రోజుతో ఆ వూళ్లో తిమ్మరాజు గౌరవం అమాంతం పెరిగిపోయింది. అందరూ అతనితో ఎంతో భయంతో, భక్తితో ప్రవర్తించసాగారు. అది మొదలు తిమ్మరాజును ఊరంతా "పులిరాజు... పులిరాజు..." అని పిలవసాగారు.

- పుప్పాల కృష్ణమూర్తి

గతం గురుతులు...



గతం ఎప్పుడూ ఘనమే. నాటి జ్ఞాపకాలు, కబుర్లే కాదు. నాడు వాడిన వస్తువులు కూడా గొప్పవే. నిన్నటి వరకు ఎంతో ఇష్టంగా ఉపయోగించిన వస్తువులు నేడు కనుమరుగవుతున్నా మరిచిపోవడం కష్టమే. ఇప్పుడంటే విదేశీ శీతలపానీయాలు, రీలు లేని కెమేరాలు, పెన్‌డ్రైవ్‌లు, ఆటోలు, పెన్ పెన్సిళ్లు, ఎస్సెమ్మెస్‌లు, ఎమ్మెమ్మెస్‌లు, వాడి పడేసే పెన్నులు, ఫెవి స్టిక్కులు, డీవీడీలు వచ్చాయికానీ...అప్పట్లో ఇవేవీ లేకుండానే కాలం గడిచింది. అప్పుడు హీరో పెన్నులో బ్రిల్ ఇంకు పోసి అపురూపంగా రాసుకునేవారు. బుజ్జి సోనీ టేప్‌రికార్డర్‌ను చెవి దగ్గర పెట్టుకుని మరీ ఇష్టమైన సినిమా పాటలు వినేవారు. పల్చటి ఫ్లాపీలో ముఖ్యమైన సమాచారం భద్రపరచుకునేవారు. పిల్లలు కేమెల్ గమ్‌తో బొమ్మలు అతికించుకునేవారు. నటరాజ్ పెన్సిల్‌తో కళాఖండాలే సృజించేవారు. ఎంచక్కా మూడు చక్రాల రిక్షాలో గమ్యస్థానం చేరుకునేవారు. వీటిలో కొన్ని మాత్రమే ఇప్పటికీ అక్కడక్కడ కనిపిస్తున్నా... నాటి జ్ఞాపకాలు ఎక్కడికి పోతాయి!